ప్రజాశక్తి

శనివారం 30 ఆగస్టు, 2025

## 19 నుంచి ఎంపీ కప్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రన్న క్రీడా ఉత్సవంలో భాగంగా ఎంపీ కప్-2025ను సెప్టెంబరు 19వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా ఉత్సవంలో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, ఏడు పెంకులాట, కర్రసాము, చెస్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్ వంటి ఎనిమిది ప్రధాన, సంప్రదాయ క్రీడా పోటీలను శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం https://yvssrikakulam.live/sportsRegister లింక్ ద్వారా క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. యువతలో క్రీడాస్ఫూర్తి, ఫిట్‌నెస్, ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# వంశధారకు దిక్కెవరు?

ఖరీఫ్‌లో వ్యవసాయం ఎంత ప్రాధాన్యమైన అంశమో, సాగునీటి రంగమూ అంతే కీలకం. సాగునీరు సాఫీగా సాగితేనే శివారు భూములకు నీరు చేరుతుంది. ఇలా జరగాలంటే కాలువలు, షట్టర్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీంతోపాటు వరదల సమయం కావడంతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఆవశ్యకత ఉంది. కాలువ గట్లు బలహీనంగా ఉన్న నేపథ్యంలో గండ్లు పడే ప్రమాదమూ లేకపోలేదు. మరోవైపు వంశధార ఫేజ్-2, స్టేజ్-2 పనులు, హైలెవల్ కెనాల్, ఆఫ్‌షోర్ పనులూ సాగుతున్నాయి. అవసరమైన సిబ్బంది ఉన్నప్పుడే వీటిపై పర్యవేక్షణ సాధ్యపడుతుంది. వంశధార సర్కిల్‌కు సంబంధించి ఎస్ఇ నుంచి ఎఇఇ పోస్టుల వరకు ఖాళీగానే ఉండడంతో ప్రాజెక్టు నిర్వహణ, పనులకు దిక్కు లేకుండా పోయింది. ఒకవైపు ఖరీఫ్ సీజన్ కీలక దశలో నడుస్తోంది. మరోవైపు వర్షాలు, వరదలు సంభవిస్తున్న నేపథ్యంలో సిబ్బందిని భర్తీ చేయకుండా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు సర్కిల్ కార్యాలయం

- మూడు నెలలుగా ఎస్ఇ పోస్టు ఖాళీ
- ధవళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఇకి ఇన్‌ఛార్జి బాధ్యతలు
- నాలుగు ఇఇ పోస్టులు, 21 చోట్ల ఎఇఇలు లేని పరిస్థితి
- కీలక తరుణంలో పోస్టుల భర్తీపై దృష్టిసారించని ప్రభుత్వం

జిల్లాలో వంశధార ప్రాజెక్టు అత్యంత ప్రధాన సాగునీటి వనరు. వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేసే ముఖ్యమైన ప్రాజెక్టు. కుడి, ఎడమ కాలువల పరిధిలో 16 మండలాల్లోని రైతులకు ప్రయోజనం కలిగించే సాగునీటి కల్పతరువు. ఖరీఫ్‌లో అత్యధిక పంటల సాగు అయ్యేది ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టే. ఇటువంటి కీలకమైన ప్రాజెక్టుపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. వంశధార నీరు రావడం లేదంటూ ఇప్పటికే పలాస ప్రాంత రైతులు ప్రజాప్రతినిధులు, అధికారుల ముందు మొరపెట్టుకుంటున్నారు. నీరు అవసరమైన సమయంలో విడిచిపెట్టడం, వర్షాలు పుష్కలంగా పడుతుండడంతో పొలాలు ముంపునకు గురికాకుండా వాటిని నియంత్రించాల్సి ఉంటుంది. ఈ పనులన్నీ క్షేత్రస్థాయిలో పనిచేసే ఎఇఇలే చూస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టులు 21 వరకు ఖాళీగా ఉండడంతో, నీటి నియంత్రణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతోపాటు వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం చేపడుతున్న పనులను, సిబ్బందిని మోనటరింగ్ చేసే ఎస్ఇ పోస్టు ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

### ధవళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఇ తప్ప వేరెవరూ లేరా?

వంశధార సర్కిల్ ఎస్ఇగా పనిచేసిన తిరుపతిరావు మే 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో తోటపల్లి ప్రాజెక్టు రెగ్యులర్ ఎస్ఇగా విధులు నిర్వర్తిస్తున్న స్వర్ణకుమార్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఆయనకు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల ఇంజినీర్ ఇన్ చీఫ్ ఉద్యోగోన్నతి రావడంతో విశాఖ వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ధవళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఇగా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు ప్రభుత్వం వంశధార బాధ్యతలను అప్పగించింది. తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆయన వారానికి రెండుసార్లు ఇక్కడికి వచ్చి బాధ్యతలను చూస్తున్నారు. వంశధారకు కనీసం రెగ్యులర్ ఎస్ఇని నియమించలేకపోయిన ప్రభుత్వం, సమీప జిల్లాల నుంచి కాకుండా సుదూరంగా ఉన్న ధవళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఇకి బాధ్యతలు అప్పగించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాకు రావడానికే ఒక పూట సమయం పడుతున్న నేపథ్యంలో ఫైళ్ల క్లియరెన్స్‌కే సమయం సరిపోతోంది. క్షేత్రస్థాయి సందర్శనకు సమయం సరిపోని పరిస్థితి నెలకొంది.

### పనులపై తీవ్ర ప్రభావం

వంశధార ప్రాజెక్టు, ఆఫ్‌షోర్, హిరమండలం ఎత్తిపోతల పథకం తదితర పనులతో పాటు ఖరీఫ్‌లో సాగు నీటి సమస్యల పరిష్కారానికి కోట్ల రూపాయలతో పలురకాల పనులు చేస్తున్నారు. వీటిని పర్యవేక్షించే అవకాశం లేకుండా పోయింది. అదేవిధంగా హిరమండలం, టెక్కలి డివిజన్లతో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సాగునీటి సమస్యలను పరిశీలించే కీలకమైన ఎఇఇలు 95 మంది పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 37 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగోన్నతులు కల్పించడంతో, వారంతా డిఇలుగా బదిలీ అయ్యారు. దీంతో కాలువల ద్వారా వచ్చే వంశధార నీటిని నియంత్రించే పరిస్థితి చాలావరకు లేకుండా పోయింది. వీరిని ఎగ్జిక్యూటివ్ చేయాల్సిన ఇఇలు కూడా తగినంత మంది లేరు. ఆరుగురు ఇఇలు పనిచేయాల్సి ఉండగా, నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

### అసలే వరదల సమయం

అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో జిల్లాతో పాటు ఒడిశాలోనూ వర్షాలు కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో ప్రతి ఏడాది తుపాన్లు, వాయుగుండాలు సంభవిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. వీటి ప్రభావం అక్టోబరు వరకు ఉండే అవకాశం ఉంది. వరదలపై ఒడిశాతో సమన్వయం, నదీ పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడం, సిబ్బందిపై పర్యవేక్షణ బాధ్యతలన్నీ ఎస్ఇ మాత్రమే చేయాల్సి ఉంటుంది. ధవళేశ్వరం నుంచి వచ్చే ఎస్ఇ వీటిని అంతగా మోనటరింగ్ చేసే పరిసితి ఉండదు. ప్రభుత్వం వెంటనే వంశధారకు రెగ్యులర్ ఎస్ఇని నియమించడంతో పాటు క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే ఎఇఇ పోస్టులను భర్తీ చేయాలని అంతా కోరుతున్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు

## ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

- ఏడాదికి రూ.25 వేల భృతి ఇవ్వాలి
- సంక్షేమ చట్టం చేయాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు
- ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల ర్యాలీ

ప్రజాశక్తి - రణస్థలం

ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి నష్టపోతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.25 వేల భృతి ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఉపాధి నష్టపోతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు భృతి ఇవ్వాలని, సంక్షేమ చట్టం చేయాలని కోరుతూ రణస్థలంలో సిఐటియు, ఎఐటియుసి ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు రామతీర్థం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులకు సేవలందిస్తూ, కుటుంబాలను పోషించుకుంటున్న డ్రైవర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, వాహన విడిభాగాలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో రోజంతా ఆటో, వ్యాన్లు నడిపినా పూట గడవడమే కష్టంగా ఉన్న తరుణంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలు, వ్యాన్లు, జీపు డ్రైవర్లకు ఆదాయం రాక... ప్రైవేటు ఫైనాన్స్‌కు వాయిదాలు కట్టలేక, కుటుంబ పోషణకు, చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు భారమైన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రోడ్ టాక్స్, టోల్ ఫీజులు 30 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. డీజిల్, పెట్రోల్ వాహన విడి భాగాల ధరలపై వేస్తున్న జిఎస్‌టి, వ్యాట్, సెస్ పన్నులు రద్దు చేసి డ్రైవర్ల కుటుంబాలను అదుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే బ్యాడ్జి కలిగిన డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థికసాయం చేస్తామని, పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, అనారోగ్యంతో చనిపోతే రూ.ఐదు లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.పది లక్షలు ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీనిచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కె.శివ, సిఐటియు నాయకులు వెలమల రమణ, ఎస్.లక్ష్మణరావు, బి.రామకృష్ణ, బొంతు లక్ష్మణరావు, చిరంజీవి, ఎం.రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కృషి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గత పాలకుల వైఫల్యం కారణంగానే వెల్లువలా ప్రజా సమస్యలు పెద్దఎత్తున వస్తున్నాయని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. వారి సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమాన్ని అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గ్రామాల్లో రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు అధికారులు డబ్బులు కట్టమంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తల్లికి వందనం, అన్నాదాత సుఖీభవ పథకం నిధులు తమ ఖాతాల్లో జమ కాలేదని మంత్రికి వివరించారు. రెండో విడతలో జమ చేస్తామని మంత్రి తెలిపారు.

### విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష

నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులకు ఇబ్బందులు తలెత్తుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు తొలగించాలని సూచించారు. ప్రజల నుంచి వస్తున్న విద్యుత్ సమస్యల ఫిర్యాదు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నా సమావేశంలో డిఇ, ఎఇలు పాల్గొన్నారు.

### కష్టపడి పడే వారికి గుర్తింపు

టిడిపి కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో పొందర కూరాకుల చైర్మన్ దామోదర నరసింహను సన్మానించారు.

## జీడి రైతుల ఆర్థికాభివృద్ధికి భరోసా

- ఆదాయం పెంపునకు ప్రత్యేక ప్రణాళికలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జీడి రైతుల ఆర్థికాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పలాస ప్రాంత జీడిపప్పుకు కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ అధ్యక్షతన జీడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీడి రైతులకు సరైన ఆదాయం రాబట్టే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలోని బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు సులభ రుణ సదుపాయాలు కల్పించాలని, డిఆర్‌డిఎ ద్వారా సబ్సిడీలు, ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యానశాఖ ద్వారా ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా కఠిన పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రాసెసింగ్ యూనిట్లకు విద్యుత్ శాఖతో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు ఆదేశాలిచ్చారు. ముఖ్యంగా 20 కిలోవాట్స్ లోడ్ కంటే తక్కువ ఉన్న యూనిట్లకు ట్రాన్స్‌ఫార్మర్ అవసరం లేకుండా సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీడిపప్పు బైప్రొడక్ట్స్‌ను ఉపయోగించి రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశాలనూ సమావేశంలో చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన మోడల్ ఫార్మ్స్‌ను పరిశీలించి, వాటి అనుభవాలను జిల్లాలో అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. మన జిల్లాలో జీడి రైతులు మరింత లాభం పొందేలా, ప్రాసెసింగ్ యూనిట్లు బలోపేతమయ్యేలా, విలువ ఆధారిత ఉత్పత్తులు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు ఎఫ్‌పిఒగా ఏర్పడి ముందుకొస్తే 75 శాతం సబ్సిడీ కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా చూడాలని, మధ్యవర్తుల నుంచి రుణాలు పొందవద్దని రైతులకు సూచించారు.

కలెక్టర్‌కు జీడి రైతుల సమస్యలను వివరిస్తున్న రైతుసంఘాల నాయకులు

### జీడికి మద్దతు ధర నిర్ణయించాలి

సమావేశంలో రైతుసంఘాల నాయకులు అనేక అంశాలను లేవనెత్తారు. స్వామినాథన్ సిఫార్సులను అనుసరించి సి2 ప్లస్ 50 ఫార్ములా ప్రకారం జీడి పంటకు మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. జీడి, కొబ్బరి బోర్డులను ఏర్పాటు చేసి జీడి పిక్కలను రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మధ్యవర్తిత్వానికి అవకాశం లేకుండా చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు, రైతులకు విత్తనాలు, ఎరువులను సబ్సిడీ ధరలపై అందించాలని విజ్ఞప్తి చేశారు. స్టాండర్ట్ ఆపరేషన్ ప్రొసీజర్ అనుసరించి జీడి సీజన్ ప్రారంభమయ్యే ఏప్రిల్‌లో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యాన ధర నిర్ణయ కమిటీ వేయాలన్నారు.

జీడి పంటలను కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరల జాబితాలో చేర్చేలా చూడాలని కోరారు. సమావేశంలో ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసరావు, ఎల్‌డిఎం సూర్య కిరణ్, కార్మికశాఖ ఉప కమిషనర్ కె.దినేష్ కుమార్, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, ఎఐకెఎం జిల్లా నాయకులు మడ్డు రాఘవరావు, బత్తిని లక్ష్మీనారాయణ, వై.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర దర్యాప్తుతో కేసుల ఛేదన

### ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పలాస

సమగ్ర దర్యాప్తు, భౌతిక ఆధారాలతో పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ కేసులు త్వరితగతిన ఛేదించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రాపర్టీ కేసులకు సంబంధించి గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల నమోదు దర్యాప్తు చేయాలన్నారు. పెండింగ్, కేసుల దర్యాప్తులో సాధించిన ప్రగతి, నిందితుల అరెస్టు, కేసుల పెండింగ్ కారణాలపై ఆరా తీశారు. అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. సమగ్రమైన దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులు త్వరితగతిన ఛేదించి, కేసు ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. ప్రత్యేక బృందాలతో పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని సూచించారు. పలు కేసుల్లో పెండింగ్ ఉన్న ఎన్‌బిడబ్ల్యుపై దృష్టిసారించి త్వరితగతిన అమలు చేయాలన్నారు. సమావేశంలో కాశీబుగ్గ డిఎస్‌పి వి.అప్పారావు, సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

### అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎస్‌పి మహేశ్వర రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్ మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

## పారదర్శక ఓటరు జాబితా లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పారదర్శక ఓటరు జాబితా లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా కచ్చితత్వం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, బూత్ లెవల్ ఏజెంట్ల జాబితా సమర్పణపై సూచనలు ఇచ్చారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులందరికీ ఓటు హక్కు కల్పన, పక్కాగా తప్పుల్లేని జాబితా లక్ష్యమని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.గణపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జి.కె శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మాదారపు వెంకటేష్, ఆర్.శంకరరావు, పురుషోత్తం, భాస్కరరావు, సి.బాషా తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాకు చెందిన డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారంతో ముగిసింది. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. జిల్లాలో 543 మంది ఎంపిక కాగా, గురువారం 403 మందికి, శుక్ర వారం 140 మందికి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన మెరిట్ జాబితా ప్రకారం ఎంపికైన వారికి వచ్చిన వ్యక్తిగత సమాచారం మేరకు స్థానిక ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు కమిటీలు వేశారు. ఈ మేరకు కమిటీలు దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, మళ్లీ అప్‌లోడ్ చేశారు. పిఇటి పోస్టులకు సంబంధించి కాంట్రాక్టు ఉద్యోగం చేస్తూ బిపిఇడి కోర్సు చేసినట్లు ఫిర్యాదులు రాగా, వారు చేస్తున్న ఉద్యోగ ప్రాంతం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను అధికారులు సమగ్రంగా పరిశీలిస్తున్నారు. ఎంపిక జాబితాలో వెరిఫికేషన్ ఆధారంగా, అన్‌లైన్‌లో త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగ్‌లు కేటాయించనున్నారు. ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు, సమగ్ర శిక్ష ఎపిసి ఎస్.శశిభూషణ్, డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరైన డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థులు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనోజ్

మనోజ్ (ఫైల్ ఫొటో)

## ఆటో బోల్తా

- ఏడో తరగతి విద్యార్థి మృతి
- ఎనిమిది మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం నుంచి అల్లినగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో శుక్రవారం బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడో తరగతి విద్యార్థి కుప్పిలి మనోజ్ (13) మృతి చెందాడు. డ్రైవర్‌తో పాటు ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. అల్లినగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు ఆరుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఆటో ఎక్కారు. చిలకపాలెం దాటిన తర్వాత సర్వీస్ రోడ్డుపై ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిలకపాలెం పంచాయతీ మునిపేటకు చెందిన విద్యార్థి కుప్పిలి మనోజ్ తీవ్రంగా గాయపడ్డాడు. మిగతా విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మనోజ్ మృతి చెందాడు. చిలకపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మనోజ్ ఏడో తరగతి చదువుతుండగా, అదే పాఠశాలలో మనోజ్ అక్క దర్శిని తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి ప్రకాష్ కార్పెంటర్. అరకొర ఆదాయంతో పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. తల్లి సంతోషి గృహిణి. కుమారుని మృతితో తల్లిదండ్రులు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బస్సు నుంచి జారిపడి హెచ్‌ఎం మృతి

చింతామణి (ఫైల్)

సోంపేట : మండలంలోని జింకిభద్ర వద్ద శుక్రవారం బస్సు లోనుంచి జారిపడి బారువకు చెందిన ప్రధానోపాధ్యాయులు చింతామణి (53) మృతి చెందారు. బారువకు చెందిన చింతామణికి ఇటీవల జింకిభద్ర జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలిగా ఉద్యోగోన్నతి పొందింది. రోజులానే పాఠశాలకు వచ్చేందుకు బారువా నుంచి ఆర్‌టిసి బస్సులో ఎక్కింది. జింకిపద్ర కూడలి వద్ద బస్సు దిగేటప్పుడు జారి కిందకు పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఆమెకు వివాహం కాలేదు. మృతురాలికి తండ్రి, ఇద్దరు సోదరీమణులు, సోదరుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హెచ్‌ఎం మృతి విషయం తెలుసుకున్న ఎంపిపి నిమ్మన దాసు, నాయకులు టి.చంద్రశేఖర్, టి.నాగు, ఉపాధ్యాయులు ఎం.ఈశ్వరరావు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపం తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM

I. A.160/2024 IN OS 26/2020

BETWEEN:

GEDELA SAVITRI ......Petitioner / Plaintiff

AND

DASARI RAJYALAKSHM ...Respondent / Defendant

To

DASARI RAJYALAKSHMI W/O SRIDHAR, NARASANNAPETA TOWN AND MANDALAM, SRIKAKULAM

NOTICE

Please take notice that the above petition in IA160 /2024 in OS 26/2020, is stands posted on 04-09-2025 for your appearance before the HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE COURT SRIKAKULAM therefore you are hereby directed to appear before this the HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE COURT SRIKAKULAM on 04-09-2025 at 10.30 a.m. either in person or through an advocate, failing which the matter will be decided in your absence.

DHAVALA VIJAYALAKSHMI,
DAVALA ANANDA RAO,
Advocates,
Davala Seethamma Colony,
G.T. Road, Srikakulam.
Ph: 94406 83517, 98665 23659

# అచ్చ తెలుగు.. చిచ్చర పిడుగు 'గిడుగు'

సంతబొమ్మాళి : అ ఆ అక్షర ఆకృతిలో కూర్చున్న దండుగోపాలపురం విద్యార్థులు

కవిటి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

**కోటబొమ్మాళి:** తెలుగు భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మన మాతృభాషను దూరం చేసేవిధంగా ఉన్న వ్యక్తుల తీరు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా మంత్రి అచ్చెన్న నివాళి అర్పించారు. మాట్లాడే భాష, రాసే భాష ఒకటే కావాలని తపించి.. ఆ దిశగా వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగుజాతి ఎన్నడూ గిడుగు రామ్మూర్తి సేవలను మరువకూడదని పేర్కొన్నారు. వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడైన గిడుగు రామ్మూర్తి స్ఫూర్తిని తెలుగు భాషాభిమానులు ఎన్నటికి మరువరని తెలిపారు.

**కవిటి:** గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి, భాషలో ఉన్న అందాన్ని, విలువని తెలియజేసిన అచ్చ తెలుగు చిచ్చరపిడుగు గిడుగు వెంకట రామ్మూర్తి అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిజి పుట్టుగ, ముత్యాలపేట, జిల్లా పరిషత్ ఉన్నత, కవిటి ఉన్నత, బొరివంక ఎంపిపి పాఠశాలలు, కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల, బివికె పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన ప్రముఖ కవి ఉపాధ్యాయుడు మొర్రి గోపిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరింగి మధు, పాల్గొన్నారు.

తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవం సందర్భంగా యుటిఎఫ్ ఆధ్వర్యాన పలు పాఠశాలల్లో నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రమైన మన రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకపోవడం అత్యంత దారుణమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి పాఠశాలలో సమాంతర మాధ్యమంగా తెలుగు కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్ మాట్లాడుతూ తెలుగు మీడియం లేకపోవడం వల్ల చాలామంది బాలికలు డ్రాప్ అవుట్ అవుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సందీప్, దిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

**మందస :** మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో మాతృభాష, క్రీడా దినోత్సవాన్ని స్థానిక ప్రధానోపాధ్యాయులు కూన వేణుగోపాల్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్చంద్ చిత్రపటాలకు పూలమాల సన్మానించారు. అనంతరం స్థానిక తెలుగు ఉపాధ్యాయులు ఎ.అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బి.రమేష్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు తెలుగు టాలెంట్ టెస్టు, కొన్ని ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, జి.భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, ఎస్.హారిక తదితరులు పాల్గొన్నారు.

**నరసన్నపేట :** స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు లక్కోజు గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు:** మండలంలోని నగరంపల్లి, పల్లిసారథి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్‌ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు పి.గజేంద్రరావు, జె.నార్మాక్షీనరావు, తెలుగు ఉపాధ్యాయులు ఎం.అప్పలరామయ్య, ఆర్.ఇంద్రసేనరావులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తలగాన హేమారావు, వై.కాంతారావు, గుంట కోదండరామ, కె.శ్రీనివాసరావు, ఉమారావు, మాధవరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

**సోంపేట:** మండలంలోని పలాసపురం పంచాయతీ సచివాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులు బాబూరావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మౌనిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన తెలుగు బాషా దినోత్సవంలో వైస్ ప్రిన్సిపాల్ దుర్యోధనదొలై, అధ్యాపకులు సీతమ్మ, శివకుమార్, మోహనరావు, రాజేంద్ర, బృందావనం, దేవరాజు, లోకేష్, ఎన్ఎస్ఎస్ పిఒ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి :** మండలంలోని దండుగోపాలపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న గిడుగు రామ్మూర్తి, ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. శతకపద్యాలు, పాటలు, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు 'అ ఆ' అక్షర ఆకృతుల్లో కూర్చొని భాషపై తమ మక్కువను ప్రదర్శించారు. మండలంలోని యామాలపేట జెడ్‌పి ప్రధానోపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు.

**నరసన్నపేట:** స్థానిక మారుతీనగర్‌లోని జ్ఞానజ్యోతి స్కూల్‌లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెలమట భాస్కరరావు,కరస్పాండెంట్ బోర రామారావు, కో-ఆర్డినేటర్ తర్ర సత్యనారాయణ, డైరెక్టర్ పాగోటి లక్ష్మి పాల్గొన్నారు.

**నందిగాం:** పెద్దతామరపల్లి, నందిగాం జిల్లా పరిషత్ పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.హేమలత, బాలక శంకరరావు పాల్గొన్నారు.

**టెక్కలి :** టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, ఐక్యూ కోఆర్డినేటర్ వి.ఒ.కోటేశ్వరరావు అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రణవి డిగ్రీ కళాశాల ఆవరణలో వ్యవస్థాపకులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పేడాడ చంద్రశేఖర ఆజాద్, బిఎస్‌జెఆర్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసరావు ఆధ్వర్యాన స్థానిక ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాలలో ప్రిన్సిపాల్ మల్లా మధులత ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పలాస :** మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ వేష ధారణ ధరించి వారు నటించిన నాటికలు ఉపాధ్యాయులు, చూపరులకు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వర రావు పండా, ఉపాధ్యాయులు ఆస్పన ఈశ్వరరావు, కణితి సూర్యనారాయణ, పెద్దింటి ఈశ్వరరావు, రజనీకుమారి పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు :** మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలో నిర్వహించిన తెలుగుభాష దినోత్సవం వేడుకలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, తెలుగు ఉపాధ్యాయులు కేశవరావు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం సిటీ:** నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో శుక్రవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని, ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్ని, విలువను తెలియచెప్పిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని అన్నారు. డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎచ్చెర్ల) హాజరయ్యారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి ముని మనవడు సూర్యనారాయణ అందజేసిన నగదు ప్రోత్సాహక బహుమతులు తెలుగు భాష పోటీల విజేతలు ఎన్.శ్రీలక్ష్మి రూ.5,555, ఎం.వరలక్ష్మి రూ .3333, డి.మీనాక్షి రూ.1111 చొప్పున డిడిలను అందజేశారు.

### సన్ డిగ్రీ కళాశాలలో...

స్థానిక సన్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. సాహితీ స్రవంతి, డిగ్రీ కళాశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభలో తెలుగు అధ్యాపకులు బాడాన శ్యామలరావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి సవర భాషకు లిపి, వ్యాకరణాన్ని కనుగొన్నారన్నారు.

### జయంతి ప్రభుత్వమే నిర్వహించాలి

నగరంలోని గాంధీ మందిరంలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ కొంక్యాన మురళీ మోహన్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి జయంతి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిం చాలన్నారు. రాష్ట్ర జర్నలిస్టుల ఫోరం ఉపాధ్యక్షుడు శాసపు జోగినాయుడు, సీనియర్ జర్నలిస్ట్ ఎన్.ఈశ్వరరావు, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గేదెల లక్ష్మీ, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పిజి గుప్తా, బి.వి.రవిశంకర్, ఎస్.సంజీవరావు, డి. కృష్ణారావు, రామ్ బాయి, ప్రసాదరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పొందూరు : సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

### కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కాళాశాలలో తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా డా బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగ సహాయ ఆచార్యులు డా ఉదయ్ కిరణ్ పాల్గొని గిడుగు చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ పాల్గొన్నారు.

**పొందూరు:** మండలంలోని మలకాం గ్రామ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం, దాని ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ఎంతగానో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.గవరయ్య, జి.మధుబాబు పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** మండలంలోని కొర్లకోట జిల్లా పరిషత్ హైస్కూల్లో గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం గేదెల యమున జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎ శ్రీనివాసరావు, రాజేష్, సరస్వతి, శ్రీనివాసరాజు, శ్రీనివాసరావు, సిఆర్‌ఎస్ బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

**ఎచ్చెర్ల:** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, మూల తాతయ్య, ఎఒ డా.ముని రామకృష్ణ, డీన్. డా.శివ రామకృష్ణ, పూర్వపు డీన్. మోహన్ కృష్ణ చౌదరి, డా.పి.చిరంజీవిరావు, డా.ఆర్.గణపతిరావు, డా.పి. ముకుంథరావు, వి.సాగర్, కోటారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైల్వే సాధన కమిటీ సభ్యులు

## రైల్వే జిఎం దృష్టికి బారువ రైల్వేస్టేషన్ సమస్యలు

**సోంపేట:** భువనేశ్వర్‌లో శుక్రవారం నిర్వహించిన జెడ్ఆర్‌యుసిసి సమావేశంలో రైల్వే జిఎంకు బారువ రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు, పలు రైలు నిలుపుదలకు వినతిపత్రం అందజేసినట్లు రైల్వే నిలుపుదల సాధన కమిటీ అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి తెలిపారు. ఈ మేరకు సంఘ ప్రధాన కార్యదర్శి రత్నాల శ్రీనివాసరావు, కన్వీనర్ మడ్డు కుమార్, కోశాధికారి ధర్మారావు సభ్యులతో కలసి జెడ్ఆర్‌యుసిసి మెంబరు శ్రీనివాస రంగా రౌలో, సూరాడ చంద్రమోహన్ ఆధ్వర్యాన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ద్వారా రైల్వే జిఎంను కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బారువ, సోంపేట రైల్వేస్టేషన్లలో పలు సమస్యలను గురించి తెలియజేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంతోపాటు బారువా రైల్వే స్టేషన్‌లో రైల్లే నిలుపుదలకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.జోగారావు, లింగరాజు, దిల్లేశ్వరరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

కళాకారులను సన్మానించిన కమిటీ సభ్యులు

## ఆకట్టుకున్న గాత్ర కచేరి

**కవిటి:** మండలంలోని ప్రగడపుట్టుగలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సంగీత కచేరీ ఆద్యంతం అలరించింది. పండి హరి శంకర్, దూట్ల వెంకటేశం గాత్రానికి పండి రవి వయోలిన్, బెందాళం రామారావు హార్మోనియం, గొనప లక్ష్మణమూర్తి మృదంగం తోడవడంతో కచేరి కనులవిందుగా సాగింది. అనంతరం కమిటీ సభ్యులు కళాకారులను సన్మానించారు. బిమ్మో సాహు, శ్రీరామ్మూర్తి బిసాయి, బదకల ప్రసాద్, కొంపల్లి సాగర్, ముత్యాల శ్రీకాంత్, బోరుపద్ర మోహనరావు, బండారు రాజు, దశరథరావు, కొరికాన రమేష్, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రీడా దినోత్సవం

**కవిటి:** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విజయాలు సాధించిన పలువురు క్రీడాకారులను సన్మానించారు. బిజి పుట్టుగ, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల, బివికె పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరింగి మధు పాల్గొన్నారు.

## జాతీయ యోగా పోటీలకు శ్రీకాంత్ మహంతి

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న శ్రీకాంత్ మహంతి

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన యోగా క్రీడాకారుడు శ్రీకాంత్ మహంతి ఈ నెల 29 నుంచి 31 వరకు నాగపూర్‌లో నిర్వహించనున్న జాతీయ యోగా పోటీలకు ఎంపిక య్యారు. ఇటీవల ఎపి యోగా కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 24న నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా ఎంపికలో ఎం.శ్రీకాంత్ మహంతి అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని సాధించి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. జాతీయ యోగా పోటీలకు ఎంపికైనట్టు రాష్ట్ర యోగా కోచ్ ఎం. రామకృష్ణ సమాచారం అందించారు. శుక్రవారం విజయవాడ నుంచి నాగపూర్ బయలుదేరింది. ఈ జట్టులో ఎం.సంతోష్, రఘురామయ్య, యశ్వంత్, నిహారిక, నిక్షిప్త, సాయి రాఘవేంద్ర, సంధ్యా, సునీత పాల్గొంటున్నారని తెలిపారు.

## నేత్ర సంరక్షణపై అవగాహన

**సంతబొమ్మాళి:** మండలంలోని నౌపడ రామమందిరంలో వృద్ధులకు నేత్ర సంరక్షణ, నేత్రదానంపై ఆప్తాలమిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేత్ర శస్త్రచికిత్స అనంతరం కూడా నేత్రదానం చేయవచ్చని వివరించారు. అనంతరం వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ అసిస్టెంట్ గిరిజ, పూజారి ఆర్.వి.రమణాచార్యులు పాల్గొన్నారు.

## ఇన్విజిలేటర్లకు డబ్బులు చెల్లించాలి

**శ్రీకాకుళం సిటీ:** పదో తరగతి పరీక్షలు ముగిసి ఐదు నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఇన్విజిలేషన్ డబ్బులు, స్పాట్ వాల్యూషన్ డబ్బులు చెల్లించలేదని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ ప్రభుత్వాన్ని విమర్శించారు. పరీక్షలు ముగిసి ఐదు నెలలు అయినప్పటికీ బిల్లులు సిఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో ఫండ్ క్లియరెన్స్ చేయకపోవడం వల్ల బిల్లులు ప్రాసెస్ జరగడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్-ఎస్‌సి ఇన్విజిలేషన్, స్పాట్ డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## కార్మికశాఖ అధికారుల తనిఖీలు

**శ్రీకాకుళం సిటీ:** ఉప కార్మిక కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రకారం ఈ కామర్స్ దుకాణాలు, సంస్థల్లో తనిఖీలను శుక్రవారం నిర్వహించారు. నలుగురు కార్మికు లకు కనీస వేతన చట్టం ప్రకారం తక్కువ వేతనాలు చెల్లిస్తు న్నట్లు గుర్తించడం జరిగిందని ఆ శాఖ ఉప కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. సంబంధిత యజమానుల నుంచి రూ.45, 514 వేతనం తేడాగా తేల్చి డిడి వసూలు చేసి సంబంధిత కార్మికు లకు చెల్లించం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించాలని స్పష్టం చేశారు.

## రైల్వే కార్మికులకు అవగాహన

**పలాస :** ఖుర్దారోడ్ డివిజన్‌లోని అన్నీ రైల్వే స్టేషన్లల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు లైంగిక వేధింపులపై రైల్వే అధికారులు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పనిచేస్తున్న ప్రదేశాల్లో మహిళలకు లైంగిక వేధింపులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విశాఖపట్నం పర్సనల్ మేనేజర్, నోడల్ అధికారిణి తపస్విని వహానందియా వివరించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా తమకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

## గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తాం

**పలాస :** గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తామని డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదికర్మ యోగిపై నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో తర్లకోట, లొత్తూరు పంచాయతీలను ఆదికర్మ యోగి కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేశాయన్నారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలన్నారు. ఆదికర్మ యోగిపై నిర్లక్ష్యం వహించ వద్ద అన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు యు.లత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాబ్‌మేళా

**టెకకలి :** టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జెకెసి సంస్థ ఆధ్వర్యాన శనివారం జాబ్‌మేళా నిర్వహించ నున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో టాటా, భారత్, బయోటెక్, ఎంఆర్‌ఎఫ్, వంటి కంపెనీ ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బిటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తులు అందించి జాబ్‌మేళాని వినియోగించుకోవాలని కోరారు.

## నేడు క్లస్టర్ సముదాయాలు

**టెక్కలి:** రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యాన శనివారం క్లస్టర్ సము దాయాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఉదయం పూట పాఠశాల తరగతులు నిర్వహించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించిన తర్వాత రెండో పూట క్లస్టర్ సముదాయాలకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ క్లస్టర్ సముదాయాలు నిర్వహించ నున్నారు. క్లస్టర్ సముదాయాల విధానం వల్ల ఒరిగేదేమి లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఉపాధ్యా యులు సంఘాలు ఇచ్చిన వినతులను పక్కన పెట్టి ఏకపక్ష నిర్ణయానికి పూనుకోవడంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

**ఆమదాలవలస:** మండలంలోని గాజుల కొల్లివలస, టి.జొన్నవలస, మునగవలస గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఇఇ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పైన పేర్కొన్న గ్రామాల్లో ఆర్‌డిఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్లు మార్చుట, పనుల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.

## పారిశ్రామికాభివృద్ధితోనే ప్రగతి సాధ్యం

### ఎమ్మెల్యే కూన రవికుమార్

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పారిశ్రామిక అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆదనపు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం ఉష పథకం కింద రూ.ఐదుకోట్ల నిధులు మంజూరయ్యాయని, రూ.4 కోట్లతో అదనపు భవనాల నిర్మాణం, రూ.25 లక్షలతో పాత భవనాల ఆధునీకరణ, రూ.50 లక్షలతో ల్యాబ్ పరికరాల కొనుగోలు, మరో రూ.25 లక్షలతో కాంపోనెంట్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 12 నెలల్లో భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. నియోజకవర్గంలో పరిశ్రమ కావాలని సిఎంను అడిగానని ధర్మల్ పవర్ ప్లాంట్ మంజూరుకు హామీ ఇచ్చారని, అయితే కొంతమంది అవగాహన లేని వ్యక్తులు తప్పుడు ప్రచారం చేసి ప్రజల్లో అపోహలు సష్టిస్తున్నారన్నారు. పవర్‌ప్లాంట్ నిర్మిస్తే దానికి అనుబంధంగా సిమెంట్ తదితర పరిశ్రమలు ఏర్పాటై పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందన్నారు. పొందూరు మండలంలో 800 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడం జరిగిందని, తొందరలోనే కార్యరూపం దాల్చనుందన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎన్ స్వామి, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, ఎన్‌టిఆర్ వర్సిటీ డైరెక్టర్ చాపర సుధాకర్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు నూక రాజు, సంపదరావు మురళి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి సభ్యుల వాకౌట్

### కోరం లేకుండా సమావేశాలంటూ ఆరోపణ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షత శుక్రవారం నిర్వహించి కౌన్సిల్ సమావేశం నుంచి వైసిపి సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం సమావేశం కొనసాగించడంతో కోరం లేకుండా చైర్మన్, కమిషనర్, ఆరుగురు టిడిపి కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారని ఆరోపిస్తూ సమావేశ మందిరం ఎదుట వైసిపి సభ్యులు బైఠాయించారు. దీనిపై చైర్మన్, కమిషనర్ ఎన్.రామారావు సమావేశానికి కోరం ఉందని, నిబంధనల మేరకు సమావేశం నిర్వహించామని సభ్యులకు వివరణ ఇచ్చారు. సమావేశం ప్రారంభంలోనే వైసిపికి చెందిన కౌన్సిలర్లు దుర్గాశంకర్ వండా, పిచ్చక అజయ్, పి.ప్రసాద్, బెల్లాల శ్రీనులు గత సమావేశంలో తాము ఇచ్చిన డీసెంట్‌పై అనంతరం జరిగిన పరిణామాలు తమకు ఇంత వరక సమాచారం ఇవ్వలేదని అన్నారు. దీనిపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారని, ఏమిటనే విషయం సభ్యులకు ఈ సమావేశం వరకు సమాచారం ఇవ్వకపోతే ఇంకేవుడు ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ డీసెంట్లో మూడు రోజుల్లో తమకు సమాచారం ఇవ్వాలని, కొరితే నోటీస్ బోర్డులో పెట్టేవారమని తెలిపారు. దీనిపై వైసిపి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ... గత సమావేశం డీసెంట్‌కు సమాధానం లేకపోతే సమావేశాలకు రావడం ఎందుకని వాకౌట్ చేశారు. అనంతరం ఆరుగురు టిడిపి సభ్యులతో సమావేశం కొనసాగించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ కోరానికి 11 మంది సభ్యులు అవసరమని, మినిట్ బుక్‌లో 11 మంది సభ్యులు సంతకాలు చేయడంతో కోరం సరిపోయిందని, దీంతో నిబంధనలకు అనుగుణంగా చైర్మన్ అనుమతితో సమావేశం నిర్వహించామని తెలిపారు. అంతకుముందు టిడిపి కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిని కొంత మంది అడ్డుకుంటున్నారని అన్నారు. సమావేవంలో కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు బోర చంద్రకళ, తంగుడు ఆశాలత, జోగ త్రివేణి, శర్వాణ గీత పాల్గొన్నారు.

కార్యాలయం ముందు బైఠాయించిన వైసిపి సభ్యులు

## ఎరువుల సరఫరాలో విఫలం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కూటమి ప్రభుత్వం రైతులకు సకాలం ఎరువులు అందించలేకపోవడంతో రైతాంగానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అరకొర ఎరువులు పంపిణీ చేసి చేతులు దులుపుకుందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందించలేకపోవడం దారుణమన్నారు. జిల్లాలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఉండి కూడా ఎరువులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేకపోయారని అన్నారు. మరో 15 రోజుల్లో ఎరువులు అందించకపోతే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎన్నికలు ముందు ప్రజలకు మభ్యపెట్టి అధికారంలో వచ్చిన తర్వాత వాగ్దానాలు విస్మరించారన్నారు. విత్తనాలు కూడా అరకొర పంపిణీ చేశారన్నారు. ఉచిత గ్యాస్ సిలెండర్ పంపిణీ కూడా అరకొరే అందుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపిపి బోర పుష్ప, మాజీ ఎంపిపి కె.మోహనరావు, వైసిపి నాయకులు కె.త్రినాథ్, ఆసి పురుషోత్తంరెడ్డి, ఇసురు యాదవ్‌రెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

## నూతన పరిశోధనలపై దృష్టి

### 'ఐతమ్' డైరెక్టర్ నాగేశ్వరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నూతన పరిశోధనలపై దృష్టి సారించాలని ఐతమ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధనల అభివృద్ధి- సాంకేతిక ఆవిష్కరణలపై రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన విద్యార్థులకు సాంకేతిక రంగంలో ప్రోత్సహించడానికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. పలు విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొని సాంకేతిక రంగంలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు నూతన పరిశోధనల అభివృద్ధి, కోడింగ్ విధానంలో మార్పులు, కొత్త అప్లికేషన్లపై దృష్టి సారించి కొత్త పరిశోధనలు నిర్వహించడానికి తగిన శిక్షణలు అందిస్తున్నామన్నారు. శిక్షణలను విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పేపర్ ప్రెసెంటేషన్, కొత్త ప్రాజెక్టుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆర్అండ్‌డి విభాగం డాక్టర్ బట్టాచార్య, డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

## మాజీ సర్పంచ్ భర్త మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కమ్మ సిగడాం పంచాయతీ మాజీ సర్పంచ్ మన్నె హేమసుధ భర్త మన్నె రమేష్ శుక్రవారం అనారోగ్యంతో కమ్మసిగడాంలో వారి స్వగృహం వద్ద మృతి చెందారు. అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. ఆయన పంచాయతీలో అందరిని కలుపుకొని పంచాయతీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసారు. ఆయన మృతికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సంతాపం తెలియజేశారు.

## వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు కూడలిలో ఉన్న దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం లావేరు మెయిన్ రోడ్డులో కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న కొండక ప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. 13 మద్యం సీసాలతో పట్టుబడినట్టు తెలిపారు. మద్యం సీసాలను సీజ్ చేసి ప్రసాద్‌పై కేసునమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం అమ్మినా, తరలించినా అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న దిచక్ర వాహనాలు

## లావేరులో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులోని ఎస్‌సి కాలనీ, పెద్దవీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారు జాము నుంచి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డాన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా దళితవాడలో రికార్డులు లేని ఎనిమిది దిచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ ఆధ్వర్యంలో పలువురు పోలీసులు గ్రామంలోని ఇళ్లు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరించినా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు అక్రమరవాణాపై సమాచారం ఇవ్వాలన్నారు.

## వైసిపి రైతు విభాగ కార్యదర్శిగా రామిరెడ్డి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని వైసిపి నాయకుడు సుగ్గు రామిరెడ్డి రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలో రైతు విభాగ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో వైసిపి రాష్ట్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పల రాజు, టెక్కలి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కర్త పేరాడ తిలక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకంపై మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## వర్థంతి పోస్టర్ల ఆవిష్కరణ

**పలాస:** మండలంలోని లొత్తూరు పంచాయతీ పెద్దగంతరులో కుమారన్న, సీతారాముల 27వ వర్థంతిని నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడులో శుక్రవారం అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుమారన్నను పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారని అన్నారు. ఆదివాసీల కోసం, పీడిత ప్రజల కోసం విప్లవమే ఆశగా శ్వాసగా జీవించిన కుమారన్నను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసినప్పుడు కూడా విప్లవ ఉద్యమాన్ని ఆపడం ఎవరి తరం కాలేదని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పార్టీ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థూపం నిర్మాణ పనులు పరిశీలన

**ఇచ్ఛాపురం :** ఇచ్ఛాపురానికి సమీపంలో కొజ్జిరియ వద్ద కొత్తగా నిర్మిస్తున్న వేమన్న స్థూపం నిర్మాణ పనులను వైసిపి నాయకులు శుక్రవారం పరిశీలించారు. రెడ్డిక సామాజిక భవనం వద్ద నిర్వహిస్తున్న యోగి వేమన్న స్తూపం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, మాజీ ఎంపిపి కె.మోహనరావు, వైసిపి నాయకులు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, ఆసి కృష్ణారెడ్డి ఆసి పురుషోత్తంరెడ్డి, కారింగ్ త్రినాథ్, ఇసురు యాదవ్‌రెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

లడ్డుతో వెంకటరావు

## సందడిగా లడ్డు వేలం

**పొందూరు:** మండ లంలోని గోరంటలో శ్రీలంక వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బాడాన వెంకటరావు వేలం పాటలో రూ.9,200కు లడ్డూను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీసభ్యులు హేమంత్, సుమంత్, సందీప్, ఉమామహేశ్వరరావు, రాజశేఖర్, హరిప్రసాద్, అవినాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తమ్మతల్లి ఉత్సవాలు విజయవంతం చేద్దాం

**కోటబొమ్మాళి:** వచ్చే నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ కమిటీ ఛైర్మన్ కోరాడ గోవిందరావు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా మా నాన్న కోరాడ మత్యుంజయ పనిచేసి సేవలు అందించారని అన్నారు. మళ్లీ ఇప్పుడు నాకు ఈ బాధ్యతలు అప్పజెప్పడం సంతోషంగా ఉందని తెలిపారు. తనపై నమ్మకంతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులకు రుణపడి ఉంటానని తెలిపారు.

## ఎమ్మెల్యే పరామర్శ

**నరసన్నపేట:** మండలంలోని చోడవరంలో అడపా శివానంద, లోపింటి అప్పారావు, యారబాటి శిరీషలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మృతుల కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పోలాకి పిఎసిఎస్ చైర్మన్ బైరి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పూతి రమణ, తెలుగు నాగేశ్వరరావు, అడపా రజనీకాంత్, చిట్టి సింహాచలం, బోర అప్పలరాజు, రవి, రమణ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న రాజారావు తదితరులు

## ఎఎంసి చైర్మన్ పరామర్శ

**లావేరు:** లావేరు పంచాయతి కేశవరాయపురానికి చెందిన ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొరను శుక్రవారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ మార్కెట్‌కమిటీ చైర్మన్, టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల గాయత్రి రాజారావు పరామర్శించారు. తోటయ్యదొర ప్రమాదవశాత్తు జారిపడిన ఘటనలో చేయి విరిగిపోవడంతో విషయం తెలుసుకుని పరామర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మధుపాడ సర్పంచ్ నల్లం అప్పారావు, తమ్మాపురం మాజీ సర్పంచ్ గురాన రామారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు నల్లం శ్రీనువాసరావు, బొంతు అప్పలనాయుడు, జనపాల రమేష్, స్థానిక నాయకులు ఉన్నారు.

# పారదర్శకంగా సరుకుల పంపిణీ

మెళియాపుట్టి : కార్డులను అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ సరుకులను పారదర్శకంగా అందించాలని లక్ష్యంతోనే ప్రభుత్వం స్మార్ట్ కార్డులను తీసుకొచ్చిందని పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ అన్నారు. మండలంలోని మెళియాపుట్టి, బాణాపురం గ్రామాల్లో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకుంటే ఐదు రోజుల్లోనే అందిస్తామని చెప్పారు. సెప్టెంబరు నెల నుంచి ఈ కార్డుల ద్వారా బియ్యం పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, మాజీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, మాజీ సర్పంచ్ నిక్కల బాబూరావు, ఆస్పత్రికమిటీ మాజీచైర్మన్ భాస్కరరావు పాల్గొన్నారు.

**కవిటి:** రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించేందుకే ప్రభుత్వం డిజిటల్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తోందని పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్ అన్నారు. మండలంలోని ఎర్ర గోవిందపుట్టుగ గ్రామంలో శుక్రవారం డిజిటల్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బెందాళం రమేష్, ఆరంగి మధు, బెందాళం తిరుమల కుమార్, వజ్జ రంగారావు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** మున్సిపాలిటీ పరిధిలోని 4, 23 వార్డుల్లో లబ్ధిదారులకు టిడిపి నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గేదెల శేఖర్, టిడిపి పట్టణ కార్యదర్శి శాసన శేఖర్, సంతోష్ కుమార్ రథో, గోపాలాచారి, మల్లా వైకుంఠరావు, బాసి పార్వతీశం ఉన్నారు.

## క్విజ్ విజేత అంపురం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కమలాయిపుట్టుగలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో అంపురం ఎంపిపి స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచి రాణించింది. డిఎస్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ దల్లి సురేష్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 83 టీములు పాల్గొన్నాయి. విజేతలకు ప్రథమ బహుమతి రూ.4,444, కుసుంపురం ఎంపిపిఎస్ ద్వితీయ బహుమతి రూ.3,333, ఇన్నేసుపేట ఎంపిపిఎస్ తృతీయ బహుమతి రూ.2,222 నగదు లభించాయి. కవిటి-1, ఇచ్ఛాపురం 1,2 ఎంఇఒలు ధనంజయ మజ్జి, విశ్వనాథం, అప్పారావు బహుమతులు అందజేశారు.

### టాలెంట్ టెస్టు విజేత కాత్యాయని

మండలంలోని డొంకపుట్టుగలో నిర్వహించిన మెగా టాలెంట్ టెస్టులో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బాలిక కాత్యాయని వర ప్రసన్న ప్రథమ స్థానంలో నిలిచి రూ.2,223 నగదు బహుమతి అందుకుంది. 212 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్న ఈ సందర్భంలో బెలగాం

బహుమతులు అందిస్తున్న ఎంఇఒలు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పాల హర్షిణి ద్వితీయ స్థానం రూ.1,111, శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నర్సు ప్రశాంతి తృతీయ స్థానం రూ.777 నగదు సాధించారు.

### పెద్ద కపాసుకుద్దిలో ప్రతిభ ప్రదర్శన

నియోజకవర్గ స్థాయి పోటీల్లో పెద్ద కపాసుకుద్దిలో విద్యార్థులు ప్రతిభను చాటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొరివంక ప్రథమ స్థానం, శిలగాం ద్వితీయ స్థానం, గొకర్ణపురం తృతీయ స్థానం కైవసం చేసుకోగా, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రత్యేక బహుమతి పొందారు.

## పోస్టల్ అధికారుల నిలదీత

పోస్టల్ అధికారులను నిలదీస్తున్న బాధితులు

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో రూ.కోట్లలో జరిగిన భారీ అవినీతిపై చోటు చేసుకున్న విషయం విషయం విదితమే. ఇప్పటి వరకు బాధితులకు డబ్బులు రాలేదు. శుక్రవారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న బాధితులు కార్యాలయానికి చేసుకుని మా డబ్బులు ఎప్పుడిస్తారో చెప్పండి, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఖాతాదారులు చాట్ల లోహిదాస్ రెడ్డి, ఇసురు బాలరాజు నిలదీశారు. నెలరోజుల్లో మా డబ్బులు మాకు ఇస్తామని చెప్పిన ఇంతవరకు స్పందించకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన శ్రీకాంత్ ఇప్పటికే అందరి గ్రీవెన్స్ స్వీకరించామని, అన్ని రిపోర్టులు తయారు చేశామని మరో ఆరు నెలల్లో మీ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. దీనికి సంతృప్తి చెందని బాధితులు రెండు రోజుల్లో మాకు సరైన సమాధానం చెప్పకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## రామయ్యపాలెంగా మార్చు చేయాలి

**మెళియాపుట్టి :** మండలంలోని వడ్డ పంచాయతీ పరిధిలోని సానిపాలెం పేరును రామయ్యపాలెంగా మార్పు చేయాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ బడే పాపారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ తమ స్వస్థలం సానిపాలెం అని చెప్పడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. తమ గ్రామం పేరు వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో ప్రతికూలం గుర్తింపు లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి గ్రామం పేరు మార్పు చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వినతిపత్రం అందజేస్తున్న రామారావు

## ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వినతి

**కంచిలి:** మండలంలోని చిర్లపుట్టుగలోగ్రామ దేవత సంబరాల సమయంలో విద్యుత్ ప్రమాదం సంభవించి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని టిడిపి మండల అధ్యక్షులు మాదిన రామారావు కోరారు. ఈ మేరకు నిమ్మాడలోని మంత్రిని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మండలంలోని 31 పంచాయతీల్లో రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరానని తెలిపారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి హామీ ఇచ్చారని అన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వినతులు స్వీకరించారు. అధికారులతో సమస్యలపై మాట్లాడి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రతి సమస్య పరిష్కారమే లక్ష్యమన్నారు. శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార మండల ప్రజలు వినతులు అందజేశారు. వికలాంగుల బృందం ప్రజాదర్బార్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సంప్రదించి, సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నా మన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మలేరియా రసాయనాన్ని పిచికారీ చేయుస్తున్న వైద్య బృందం

## మలేరియా జ్వరాలపై అప్రమత్తం

**ఆమదాలవలస:** మండలంలోని సరుబుజ్జిలిలో శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మలేరియా జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామంలోని నామాల గోవిందరావు అనే వ్యక్తికి మలేరియా నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.సూర్యం ఆధ్వర్యంలో వైద్యులు పర్యటించారు. వైద్యాధికారిణి ఎస్.సాహితీ ప్రియదర్శిని, సిహెచ్ఒ కె.మోహనరావు మలేరియా జ్వరం బారిన పడిన గోవిందరావుకు వైద్య సేవలు అందించారు. వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు మలేరియా పీడితుని పరిసర ప్రాంతంలో ఉన్న గృహాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. 56 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా ఏ ఒక్కరికి ఎటువంటి మలేరియా లక్షణాలు కనిపించలేదని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండ రామారావు, చందనాల అప్పారావు, మామిడి గోపాలరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న సినిమాకు పెద్ద విజయం

**శ్రీకాకుళం సిటీ:** జిల్లా కేంద్రంలోని స్థానిక కిన్నెర థియేటర్‌లో శుక్రవారం త్రిభాణ దారి బార్బర్క్ చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్ర నటీనటులు సత్యరాజ్, సత్యం, రాజేష్, డైరెక్టర్ మోహన్ శ్రీవత్స పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో (బాహుబలి కట్టప్ప) సత్యరాజు మాట్లాడుతూ జిల్లా ప్రేక్షకుల పలకరింపు చాలా బాగుందన్నారు. చిన్న సినిమాకి పెద్ద విజయం అందించారన్నారు. మంచి స్టోరీలతో తీసిన చిత్రాలను ఎప్పుడు తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారన్నారు. డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ జిల్లావాసిగా ఒకప్పుడు ఇదే థియేటర్‌లో సినిమాలు చూశానని, అటు వంటిది డైరెక్టర్‌గా థియేటర్‌కు రావటం ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం విజయం స్ఫూర్తితో భవిష్యత్‌లో మరెన్నో మంచి చిత్రాలు తీస్తానన్నారు. థియేటర్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
PRAJASAKTI 45 Years ANNIVERSARY 1981-2025
ప్రత్యేక అనుబంధం
Advt. Feature
శ్రీకాకుళం డివిజన్
శనివారం 30-8-2025 16 పేజీలు

# ప్రజల పక్షాన అక్షర సమరం

***45*** *సంవత్సరాల క్రితం... 1981 ఆగస్టు 1న ప్రజాశక్తి దినపత్రికగా రూపుదిద్దుకొని తెలుగు పాఠకలోకం ముందుకొచ్చింది. అంచలంచెలుగా విస్తరించి పది కేంద్రాల నుంచి ప్రచురితమవుతోంది. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలకూ ప్రజాశక్తి వార్తా సేకరణ యంత్రాంగం విస్తరించి, ప్రజా సమస్యలపై అక్షర బాణాలు సంధిస్తూ సమరం చేస్తోంది. పత్రికారంగం భారీ పెట్టుబడులమయమైపోయిన ఈ కాలంలో, ఆ పోటీని తట్టుకొని ముున్ముందుకు సాగుతోంది. సుందరయ్య, ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్, బి.టి రణదివే, మోటూరు హనుమంత రావు వంటి మహా నాయకులు నాటిన మొక్కే నేడు శాఖోపశాఖలుగా విస్తరించింది.*

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా ఉండాలనేది ప్రజాశక్తి లక్ష్యం. ప్రత్యామ్నాయ జర్నలిజం దాని ఊపిరి. దోపిడీరహిత సమాజ నిర్మాణంలో తన వంతు పాత్ర నిర్వహించడం దాని కర్తవ్యం. శ్రామికవర్గానికి, పీడిత తాడితులకు గళం అది. అభివృద్ధి కాముకులకు, అభ్యుదయవాదులకు కరదీపిక. ప్రజాస్వామ్య పరిరక్షణకు, లౌకిక విలువల పరిరక్షణకు ప్రజాశక్తి ఎప్పుడూ ముందుపీఠిన ఉంటూ వచ్చింది. నియంతృత్వ పోకడలను నిర్భయంగా ఎండగట్టింది. వారపత్రికగా ఉన్న కాలంలో అత్యయిక పరిస్థితికి ఎదురొడ్డి నిల్చింది. దినపత్రికగా పరివర్తన చెంది వేళ్లూనుకొంటున్న కాలంలోనే రాష్ట్రంలో ముఖ్యమైన పరిణామం సంభవించింది. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాటి కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా రద్దు చేసింది.

నాటి కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడను ప్రతిఘటిస్తూ సాగిన ఉద్యమంలో ప్రజాశక్తి తన వంతు పాత్రను నిర్వహించింది. అప్రజాస్వామిక చర్యలను ప్రతిఘటించడంలో ఎప్పుడూ వెన్నుచూపలేదు. ఎమర్జెన్సీలో ప్రజాశక్తి వారపత్రికకు సంపాదకుడిగా ఉన్న మోటూరు హనుమంతరావును అరెస్టు చేసి జైలులో పెట్టాలని ఎంతో ప్రయత్నించింది నాటి ప్రభుత్వం. ఆయన అజ్ఞాతంలో ఉంటూనే పత్రికను (మిగతా...2లో)

# పరిశ్రమలపై ప్రచారమే

- ఏడాది కాలంలో ఒక్క ప్రతిపాదనా పట్టలెక్కని వైనం
- నిర్వహణా భారంతో ఒక్కొక్కటిగా మూతపడుతున్న పరిస్థితి
- ఉపాధి కోసం యువత ఇతర ప్రాంతాలకు వలస
- పరిశ్రమలు, ఉద్యోగాలంటూ కూటమి నేతలు తెగ ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



***దేశంలో ఎక్కడికి వెళ్లినా జిల్లాకు చెందిన కార్మికులే కనిపిస్తారు. జిల్లాకు కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం. జిల్లా నుంచి కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోకుండా, ఇతర ప్రాంతాలే జిల్లా వైపు చూసేలా చేస్తాం. ఇవీ ఎన్నికల ముందు పలాస, పాతపట్నం తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాగళం సభల్లో ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా పట్టాలెక్కలేదు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు విషయం పక్కన పెడితే ఉన్న పరిశ్రమలు మూతపడుతున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది.***

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇథనాల్, పేపర్, ఫార్మాస్యూటికల్స్ పవర్ జనరేషన్, గ్రానైట్ వంటి భారీ, మెగా పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. వీటి ద్వారా 63,070 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తోంది. వీటితోపాటు రైస్ మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, పేపర్ ప్లేట్ ఉత్పత్తులు, పాలిథిన్ క్యారీ బ్యాగులు, ఇత్తడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు 4,083 పరిశ్రమలున్నాయి. జిల్లాలో 2014 నుంచి 2024 మధ్య కాలంలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో విశాఖలో రెండు పర్యాయాలు పారిశ్రామిక సమ్మిట్‌లు నిర్వహించారు. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయంటూ నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చెప్పారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల పరిశ్రమలు, తయారీ రంగం యూనిట్లు వస్తాయన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు ఒక్కటీ రాలేదు. ఆ తర్వాత అధికారం లోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం హయాం లోనూ కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాలేదు.

## అటకెక్కిన పాత ప్రతిపాదనలు

రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు.

ఇప్పటికీ భూమి అప్పగింత ఆలస్యమవుతోంది. అదే మండలంలోని చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. ప్రస్తుతం భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్ఎపిఎల్ ముందుకొచ్చింది. పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

## మూతపడినవి తెరిపిస్తే అదే పదివేలు

కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని చెప్తున్న కూటమి నేతలు... జిల్లాలో ప్రత్యక్షంగా రెండు వేల మందికి, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి కల్పించే ఆమదాలవలస చక్కెర పరిశ్రమను తెరిపించే విషయం కనీసం నోరెత్తడం లేదు.

పైగా రూ.వందల కోట్ల విలువ చేసే ఫ్యాక్టరీ స్థలాలను తమ అనుయాయులకు కారుచౌకగా కట్టబెట్టేందుకు అక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామంటూ ఆమదాలవలస ఎన్నికల ప్రచార సభ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జిల్లాలో ముడిసరుకు లభ్యం కాక విద్యుత్ ఛార్జీలు, ఇతర పన్నులు భరించలేక అనేక చిన్నచితకా పరిశ్రమలు మూతపడ్డాయి. వీటిలో జ్యూట్ పరిశ్రమలు ప్రధానమైనవి. జిల్లాలో జ్యూట్ పరిశ్రమల మూతపై గత వైసిపి ప్రభుత్వ హయాంలో అధ్యయనం చేసిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి వైసిపి ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని తెరిపించే విషయంలో స్పందన లేదు. వీటితో పాటు కాన్‌కాస్ట్, సింథటిక్, ప్లాస్టిక్ తదితర చిన్నాచితకా పరిశ్రమలూ మూతపడ్డాయి.

## పరిశ్రమల దుస్థితికి అద్దం పడుతున్న సర్వే

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతేడాది డిసెంబరులో సూక్ష్మ, మధ్య చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)పై ప్రభుత్వం సర్వే నిర్వహించింది. సర్వేలో జిల్లాలో పరిశ్రమల స్థితిగతులపై అనేక విషయాలు వెలుగు చూశాయి. జిల్లాలో అన్నిరకాల పరిశ్రమలు మొత్తం 27,718 పరిశ్రమలను సర్వే బృందాలు సందర్శించాయి. వాటిలో 12,508 మూతపడినట్లు గుర్తించాయి.

---

(మొదటి పేజీ తరువాయి)

# ప్రజల పక్షాన అక్షర సమరం

నిర్వహించారు.

### దోపిడీ విధానాలపై అక్షర ధ్వజం

ప్రపంచీకరణ పేర సాగుతున్న దారిద్రీకరణ విధానాలను ఎండగట్టడంలో ప్రజాశక్తిది ఎప్పుడూ ముందంజే. ప్రపంచబ్యాంకు విధానాల పర్యవసానాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తెస్తోంది. విద్య, వైద్యం, విద్యుత్, నీటిపారుదల ఇలా ప్రతి రంగంలోనూ ప్రపంచబ్యాంకు ప్రవచిత విధానాలను అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమితాసక్తి చూపెట్టాయి. ఈ విధానాల వల్ల అన్ని రంగాల్లోనూ ప్రజలపై భారాలు పెరిగాయి. ప్రయివేటీకరణ ఫలితంగా విద్యా, వైద్యాలు వ్యాపార సరుకులయ్యాయి. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు లబ్ధిదారులకు ఎలా ఉపయోగపడ్డాయనేది వివరంగా వివరించింది. అందులోని లోపాలనూ అంతే ఎండగట్టింది. విద్యుత్ రంగంలోనూ ప్రయివేటీకరణ... ప్రజలపై భారాలను ఇప్పటికే పెంచింది. మున్ముందు మరింత పెరగనుంది. భారాలు పెంచడమే కాదు, ప్రజల ఉపాధినీ హరించేలా పాలకుల విధానాలు సాగుతున్నాయి.

కోస్టల్ కారిడార్‌లో పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్ల పేర ప్రయివేట్ కంపెనీలకు భూ కేటాయింపులు జనం గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తోంది. ప్రయివేట్ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం అడవులనూ వదలడం లేదు. గిరిపుత్రులపై నిర్దయగా విరుచుకుపడుతున్నారు. గనుల పేర, సెజ్‌ల పేర భారీగా వందలు, వేల ఎకరాల భూములను ప్రయివేటు కంపెనీలకు కేటాయిస్తున్నారు. ప్రభుత్వ చర్యలపై వ్యక్తమవుతున్న వ్యతిరేకతను తెలియజేయడంతో సరిపెట్టుకోక ఇలాంటి చర్యలకు ప్రభుత్వాలు ఎందుకోసం తలబడుతున్నాయో ప్రజాశక్తి తెలియచేస్తోంది. రైతులు, కార్మికులు, సేవారంగాల్లోని ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించడంలో, అవుట్‌సోర్సింగ్ పేర ప్రయివేటు కంపెనీలకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్న తీరును ఎండగట్టడంలో ప్రజాశక్తి ఎప్పుడూ ముందుంటుంది. తన పిల్లల్ని తానే తినేసే పాములా ప్రభుత్వరంగ సంస్థలను పాలకులు మింగేస్తున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న పోరాటాలకు బాసటగా నిలుస్తోంది ప్రజాశక్తి. భూ సమస్యపై, ఇళ్ల స్థలాల కోసం పేదలు సాగించిన పోరాటాలకు అండగా నిలిచింది ప్రజాశక్తి. పంచగలిగిన, పట్టాలివ్వగలిగిన భూములు ఇక్కడ ఉన్నాయి చూడండి అంటూ జిల్లాల వారీ చూపెట్టింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జరిగిన అక్రమాలను సోదాహరణంగా ఎండగట్టింది. ప్రజాపంపిణీ వ్యవస్థను దెబ్బతీసే చర్యలను బయటపెట్టింది. వలసలు, ఉపాధి హామీ చట్టం అమలు తీరుపై ప్రత్యక్ష పరిశీలన జరిపి వాస్తవాలను పాఠకుల దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ప్రపంచ దేశాల్లో ఆర్థిక రాజకీయ రంగాల్లో సంభవిస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు పాఠకుల దృష్టికి తెస్తోంది. స్థానిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఇతర ప్రాంతాల్లో జరిగే ముఖ్యమైన అంశాలనూ వదిలివేసే విధానాన్ని ప్రజాశక్తి అనుసరించడం లేదు. ఇతర రాష్ట్రాల్లోని ముఖ్యమైన వార్తలనూ పాఠకులకు అందిస్తోంది.

### లౌకిక విలువల పరిరక్షణలో...

లౌకిక విలువల పరిరక్షణ కోసం ప్రజాశక్తి సదా నిలబడింది. వ్యాసాలు, సంపాదకీయాలు, ప్రత్యేక సంచికల ద్వారా మతోన్మాదుల చర్యలను బహిర్గతం చేసింది. గుజరాత్‌లోనూ ఇతర రాష్ట్రాల్లోనూ మతోన్మాదులు సాగించిన మారణకాండ, దాని వెనక ఉన్న రాజకీయ లక్ష్యాలను వెల్లడించింది. గుజరాత్‌లో మోడీ ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగిన నరమేధంపై కోర్టుల్లోనూ వెలుపలా పోరాటం చేస్తున్న ప్రముఖ సంఘసేవకురాలు, జర్నలిస్టు తీస్తా సెతల్వాద్‌ను రజతోత్సవాల ముగింపు సభకు ఆహ్వానించి ఆమె సాగిస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించింది. ప్రజాశక్తి 15వ వార్షికోత్సవానికి ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరు కాగా, 20వ వార్షికోత్సవంలో ప్రముఖ కవి హిందీ సినీ రచయిత జావేద్ అక్తర్ పాల్గొన్నారు. రజతోత్సవాలకు ప్రధాని మన్మోహన్‌సింగ్, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హాజరయ్యారు.

### సామాజిక సేవా కార్యక్రమాల్లో ...

*ప్రజాశక్తి దినపత్రికకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తనవంతు పాత్ర పోషిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా నెల్లూరు, చిత్తూరు, తమిళనాడు, కేరళ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజాశక్తి సిబ్బంది ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ప్రజలకు సాయపడ్డారు. గడప గడపకూ తిరిగి విరాళాల సేకరణ చేపట్టారు. కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతి, ప్రజాశక్తి వార్షికోత్సవాల సందర్భంగా ప్రజాశక్తి ఆధ్వర్యాన రక్తదాన రక్తదాన శిబిరాలు, మండు వేసవిలో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు, పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు సబ్జెక్టు నిపుణులతో సదస్సులు... తదితర వాటిని నిర్వహించడం ప్రజాశక్తికి ఒక ప్రత్యేకత. వైద్య శిబిరాల నిర్వహణ కూడా ప్రజాశక్తి సేవా కార్యకలాపాల్లో ఒకటి.*

### సామాజిక న్యాయం కోసం...

సామాజిక న్యాయంపై కూడా ప్రజాశక్తి విశిష్ట పాత్రను నిర్వహిస్తూ వస్తోంది. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పడడానికి చాలా ముందే ప్రజాశక్తి రాష్ట్రవ్యాప్తంగా దళితులపై కొనసాగుతున్న వివక్ష... ప్రత్యక్షంగా, పరోక్షంగా కన్పించే అంటరానితనంపై సమగ్ర సర్వే నిర్వహించింది. సవివరమైన కథనాలను ప్రచురించింది. పున్నయ్య కమిషన్ ఏర్పడిన అనంతరం, తాను ప్రచురించిన వార్తల క్లిప్పింగ్‌లను కమిషన్‌కు సమర్పించింది. ప్రజాశక్తిలో వెల్లడించిన వాస్తవ పరిస్థితులను పున్నయ్య కమిషన్ అందచేసిన నివేదిక కూడా నిర్ధారించింది. పలు వృత్తులకు చెందిన వారిపై, మైనార్టీల స్థితిగతులపై ప్రజాశక్తి సమగ్ర సర్వేలు జరిపి వాస్తవాలను పాఠకుల ముందుంచింది. సామాజిక న్యాయంపై జిల్లా అనుబంధంలో ప్రతి వారం ఒక పేజీని కేటాయిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజాశక్తి మాత్రమే. అణగారిన వర్గాలపై ఎక్కడ దాడి జరిగినా అక్కడ వాలిపోయి నిజానిజాలను వెలికితీసి ప్రజల ముందుంచుతోంది ప్రజాశక్తి. ఆరోగ్యం, మహిళ, యువత, బాల్యం, విద్య, సైన్స్, పోటీ పరీక్షలు వంటి అంశాలపై ప్రత్యేక పేజీలను నిర్వహిస్తోంది.

మోటూరు హనుమంతరావు మృతి అనంతరం వి.శ్రీనివాసరావు, ఎస్.వినయ్ కుమార్, తెలకపల్లి రవి, పాటూరి రామయ్య, ఎం.వి.ఎస్ శర్మ సంపాదకులుగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం బి.తులసీదాస్ సంపాదకునిగా ఉన్నారు. ప్రజాశక్తి వార పత్రిక కాలం నుంచి వి.ఆర్ బొమ్మారెడ్డి కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. కొరటాల సత్యనారాయణ తన చివరి శ్వాస వరకూ ప్రజాశక్తి సాహితీ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. పలు విభాగాల్లో పనిచేస్తూ తమ జీవితాలను ప్రజాశక్తికి అంకితం చేసిన కామ్రేడ్స్ ఎందరో ఉన్నారు. వారందరూ స్ఫూర్తి ప్రదాతలు. వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే లక్ష్యంతో ప్రజాశక్తి ముందుకు సాగుతోంది.

నిలిచిన హార్బర్ పనులు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది ఏప్రిల్ 26న ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెం గ్రామాన్ని పర్యటించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందజేసే భృతి మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా నిలిచిపోయిన ఫిషింగ్ హార్బర్ 12 నెలల్లో పూర్తిచేస్తామన్నారు. ప్రకటించి రెండు నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట అమలు కాకపోవడంపై స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

# సిఎం హామీ నీటి మూట

- 15 శాతం కూడా కాని ఫిషింగ్ హార్బర్ పనులు
- ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా కదలని వైనం
- ఎదురుచూస్తున్న బుడగట్లపాలెం మత్స్యకారులు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ**

ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో మత్స్యకారుల వలసల నిర్మూలన, జీవన ప్రమాణాల పెంపునకు బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ హార్బర్ నిర్మిస్తున్నాయి. 2023 ఏప్రిల్ 19న అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మూలపేట పోర్టు శంకుస్థాపనకు వచ్చారు. అందులో భాగంగా వచ్చి బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను రూ.365 కోట్లతో విశ్వసముద్ర సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. 15 శాతం వరకు పనులు చేపట్టారు. 504 సర్వే నంబరులో 42 ఎకరాలు ప్రభుత్వ భూమిని నిర్మాణానికి కేటాయించారు. అనంతరం 2024 మే నెల నుంచి పనులు నిలిచిపోయాయి. ఎచ్చర్ల, రణస్థలం మండలాల్లో 16 పంచాయతీల వరకు 10 వేల మంది వరకు మత్స్యకారులు ఉన్నారు. వీరి వేటకు ఈ హార్బర్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

### వేట సమయంలో మత్స్యకారులు వలసబాట

స్థానికంగా వేట అనుకూలించక మత్స్యకారులు గుజరాత్‌లోని వీరవల్, సూరత్ వంటి ప్రాంతాలకు. తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారు. హార్బర్ నిర్మిస్తే... ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి లభిస్తుంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టు సంస్థకు బిల్లులు చెల్లింపులు సక్రమంగా చేపట్టకపోవడంతో పనులు కొనసాగించలేకపోయారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లారు. వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన హార్బర్ పనులు టిడిపి కూటమి ప్రభుత్వం కొనసాగించడానికి ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజా ప్రయోజనాలు పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం విమర్శలకు తావిస్తుంది.

మత్స్యకారులు వలసలు నిర్మూలన, జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఈ హార్బర్ ఎంతో అవసరం. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా పనులు నిర్వహించాలని, సకాలంలో పూర్తిచేయాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు. ప్రారంభ సమయం లో కాంట్రాక్టు సంస్థకు 18 నెలల్లో పనులు పూర్తి చేయాలని గడువు ఇచ్చారు. గడువు పక్కన పెడితే పనులు నిలిచిపోవడం ప్రస్తుతం శాపంగా మారింది. ప్రస్తుతం రాతి కట్టడాలు, కాంక్రీటు పనులు, కాంక్రీట్ ప్లాట్ ఫారాలు, అంతర్గత రోడ్డులు ఇలా అన్ని పనులు నిలిచిపోయాయి. జాప్యం కారణంగా అంచనా

వ్యయం పెరగడం, రీ టెం డరింగ్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పనులు ప్రారంభించి హార్బర్ నిర్మాణం చేపట్టాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు.

### పనులు ప్రారంభించాలి

2023 ఏప్రిల్‌లో ప్రారంభించిన హార్బర్ పనుల్లో కదలిక లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయి. బుడగట్లపాలెం సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 12 నెలలో పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పనులు ప్రారంభించాలి.

**- అంబటి రాంబాబు, మాజీ సర్పంచ్**

### వలసలు వెళ్తున్నారు

స్థానిక మత్స్యకారులు గుజరాత్ వంటి రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారు. ఫిషింగ్ హార్బర్ పూర్తయితే ఈ ప్రాంత మత్స్యకారులకు చేపల వేట అనుకూలిస్తుంది. వలస వెళ్లకుండా స్థానికంగా ఉపాధి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వం త్వరితగతిన హార్బర్ పూర్తయ్యేందుకు కృషి చేయాలి.

**- ఎం.రాంబాబు, స్థానిక మత్స్యకారుడు**

### ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది

హార్బర్ పనులు ఉన్నతాధికారులు పరిశీలనలో ఉంది. ఎపి మెరైన్ బోర్డు నిర్మాణ పనులు పరిశీలిస్తుంది. మత్స్యశాఖకు సంబంధించి పూర్తిగా సహకరించాం. స్థల సేకరణతో పాటు పలు అంశాల్లో రెవెన్యూ, పారెస్టు శాఖలకు సహకరించాం.

**- వై.సత్యనారాయణ, మత్స్యశాఖ, ఎడి**

ఫిష్ కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్

# కోల్డ్‌స్టోరేజ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి- రణస్థలం**

జిల్లాలోని 11 మండలాల్లో మత్స్యకారులు సముద్రంలో చేపలవేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులకు కోల్డ్‌స్టోరేజ్ ప్లాంట్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో మత్స్య కారులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేపలు, ఇతర మత్స్య ఉత్పత్తులను నిల్వ చేయడానికి ఉపయోగించే ఒక శీతల గిడ్డంగి. ఇది మత్స్య సంపదను ఎక్కువ కాలం పాటు సంరక్షించడానికి, నాణ్యతను కాపాడు కోవడానికి, మార్కెట్‌లో మంచి ధర పొందడానికి సహాయపడుతుంది. కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లు మత్స్యకారులకు ఎందుకు అవసరం అంటే పాడైపోయే వస్తువులను సంరక్షించడం, చేపలు త్వరగా పాడైపోయే అవకాశం ఉన్నందున, కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేయడం ద్వారా వాటిని ఎక్కువ కాలం పాటు తాజాగా ఉంచవచ్చు.

### మార్కెటింగ్ మెరుగుకు అవకాశం

కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేయడం ద్వారా, మత్స్యకారులు తమ ఉత్పత్తులను ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంచగలరు. డిమాండ్ ఉన్నప్పుడు మార్కెట్‌లో విక్రయించవచ్చు. తద్వారా మంచి ధర పొందవచ్చు.

### వ్యర్థాలను తగ్గించడం

కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేయడం ద్వారా, పాడైపోయే చేపల వ్యర్థాలను తగ్గించవచ్చు.

### ఆహార భద్రతను నిర్ధారించడం

కోల్డ్ స్టోరేజీలు ఆహార భద్రతను నిర్ధారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా చేపలు, ఇతర మత్స్య ఉత్పత్తుల విషయంలో, ఎందుకంటే ఇవి త్వరగా పాడైపోయే అవకాశం ఉంది.

**ఆర్థిక అభివద్ధి:** కోల్డ్ స్టోరేజీలు మత్స్యకారులకు ఆదాయాన్ని పెంచడానికి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి సహాయ పడతాయి. కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు సాధారణంగా ఇది ఉష్ణోగ్రతను తక్కువగా ఉంచడానికి, చేపలను సంరక్షించడానికి అవసరం.

**నిల్వ గదులు:** వివిధ రకాల చేపలను వేరువేరుగా నిల్వ చేయడానికి ఉపయోగిస్తారు.

**లోడింగ్, అన్‌లోడింగ్ ప్రాంతాలు:** ఇవి చేపలను లోడ్ చేయడానికి, అన్‌లోడ్ చేయడానికి ఉపయోగిస్తారు.

**పరిపాలనా కార్యాలయాలు:** ఇవి ప్లాంట్ నిర్వహణకు అవసరం. భారత ప్రభుత్వం కూడా మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ఆర్థిక సహాయం అందిస్తోంది. మత్స్యకారులకు దీనిపై పూర్తి అవగాహన లేకపోవడం, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు దృష్టి సారించి మత్స్యకార గ్రామాల్లో కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



# పేర్లు రెండు... గ్రామం ఒక్కటి

## రికార్డుల్లో ఒకటి... వాడుకలో మరొకటి

ప్రజాశక్తి- పొందూరు

గ్రామం ఒకటే అయినా రెండు పేర్లతో పిలవడం ఆనవాయితీగా మారింది. తెలియనివారు వచ్చి ఆ గ్రామం అసలు పేరు చెబితే అదెక్కటుందీ అంటూ స్థానికులే కొందరు ఆశ్చర్యపోతూ ఉంటారు. గ్రామ ప్రజలు మధ్యలో ఏర్పాటు చేసుకున్న పేరు చెబితేనే అర్థం చేసుకుంటారు. ఇది ఆమదాలవలస నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల పరిస్థితి.

ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరు, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లోని పలు గ్రామాలకు రెండేసి పేర్లతో పిలవబడుతున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో ఒకపేరు, వాడుకలో మరో పేరు ఉంటుంటాయి. కొత్తగా వచ్చిన వారు ఆ గ్రామాల పేర్లు గురించి అడిగేటప్పుడు స్థానికులు సైతం ఒక్కోసారి తడబాటుకు గురవుతుంటారు. రికార్డుల పరంగా ఒక పేరు ఉన్నప్పటికీ ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో ఉన్న కుటుంబాల ఇంటిపేర్లతో పాటు, ఇతర పేర్లతో పిలవబడుతుంటాయి.

గ్రామాలు ఏర్పడిన దగ్గర నుంచి రెండు పేర్లు పెట్టి పిలవడం సార్ధకమైంది. ఆ గ్రామాల పేర్లు రెండు ఉన్నా కొందరికీ రెండింటిలో ఏదో ఒక్కపేరు మాత్రమే తెలియడం విశేషం. గ్రామంలో నివసిస్తున్న వారి ఇంటిపేర్లతో గ్రామాలను పిలవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న గ్రామం పేరు కంటే రెండో పేరు ప్రముఖంగా ప్రచారంలో ఉంటుంది. మండలంలోని కృష్ణాపురం, పుల్లాజీపేట, మలకాం గ్రామాలు ఉన్నాయి. పుల్లాజీపేట గ్రామాన్ని రెడ్డిపేట, మలకాం గ్రామాన్ని జాడపేట, కృష్ణాపురం గ్రామాన్ని గారపేటగా పిలుస్తుంటారు.

### రెడ్డి ఇంటి పేరుతో...

దల్లిపేట పంచాయతీలోని పుల్లాజీపేట గ్రామాన్ని రెడ్డిపేట అని పిలవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో సుమారు 950కు పైగా జనాభా ఉన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉన్నారు. వారిలో సుమారు 75 శాతం మంది రెడ్డి ఇంటి పేరును కలిగి ఉండడంతో ఆ గ్రామానికి రెడ్డిపేటగా పేరు సార్ధకమైంది. మండలంలో ఇప్పటికీ చాలా మందికి పుల్లాజీపేట అంటే ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఉంది.

### జాడ ఇంటి పేరుతో...

మండలంలో మలకాం గ్రామాన్ని జాడపేటగా పిలవడం దశాబ్ధాల కాలం నుంచి ఆనవాయితీగా వస్తుంది. రెవెన్యూ రికార్డుల్లో మలకాంగా ఉన్నా ఆపేరు కొందరికీ మాత్రమే తెలుసు. ఈ గ్రామంలో సుమారు 1500కు పైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో సుమారు మూడొంతులుకు పైగా జాడ అనే ఇంటిపేరు కలిగిన ఒకే సామాజిక వర్గం వారు ఉన్నారు. దీంతో ఈ గ్రామాన్ని చాలా వరకూ జాడపేట అంటేనే తెలుస్తోంది. గ్రామంలో నివశించే పూర్వీకులకు సైతం మలకాం అంటే తెలియకపోవడం ఆశ్చర్యకరం.

### గార ఇంటి పేరుతో...

మండలంలోని కృష్ణాపురాన్ని గారపేటకు పిలుస్తుంటారు. ఈ గ్రామంలో బ్రహ్మణులు ఎక్కువుగా ఉండేవారు. దీంతో కృష్ణాపుర అగ్రహారంగా పూర్వీకులు దస్త్రాల్లో పొందుప ర్చారు. కాలానుగుణంగా రానురానూ అగ్రహారం పోయి కృష్ణాపురంగా మారింది. ప్రధానంగా గ్రామంలో సుమారు 1700కు పైగా జనాభా ఉన్నారు. ఇందులో ఒకే సామాజిక తరగతికి

(మిగతా 5వ పేజీలో...)

# పేర్లు రెండు... గ్రామం ఒక్కటి

(4వ పేజీ తరువాయి...)

చెందిన గార అనే ఇంటిపేరు కలిగినవారు 70 శాతంకు పైగా ఉన్నారు. దీంతో దస్త్రాల్లో కృష్ణాపురంగా ఉన్నా... వాడుకలో గారపేటగా మారిపోయింది. ప్రభుత్వ పరంగా ఉత్తరప్రత్యుత్తరాలు జరిపేందుకు కృష్ణాపురంగా ఉన్నా... ప్రజలు నోటివెంట గారపేట గానే పిలువబడుంది.

**ఆమదాలవలస మండలంలో...**

ఆమదాలవలస మండలంలోని వంజంగిపేటకు రెండు పేర్లు ఉన్నాయి. ఈ గ్రామంలో గతంలో గట్టుముడిపేట ఇంటిపేరు వారు అధికంగా ఉండేవారు. అయితే ప్రస్తుతం గ్రామంలో ఒక్క కుటుంబమూ లేకపోవడంతో గ్రామం పేరు వంజంగిపేటగా పేరు పెట్టారు. గ్రామానికి సమీపంలో వంజంగి గ్రామం ఉండడంతో వంజంగిపేట అనే పేరుతో ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేశారు. కానీ, పూర్వ నిర్మించిన భవనాలపై గట్టుముడిపేట అని రాసి ఉంది. ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలపై వంజింగిపేట అని రాస్తున్నారు.

ఆమదాలవలస సమీపంలోని ఉన్న శ్రీహరిపురం అనే గ్రామాన్ని మూలవానిపేట అనే పేరుతో పిలుస్తున్నారు. ఆ గ్రామంలో మూల అనే ఇంటిపేరు కలిగిన ఉన్నారు. కానీ, దస్త్రాల్లో మాత్రం శ్రీహరిపురంగానే రాస్తుంటారు. పాత భవనాలపై మూలవానిపేట అని ఉండగా, కొత్తగా నిర్మాణం జరిపే భవనాలపై శ్రీహరిపురంగానే రాస్తున్నారు. చాలా మందికి మూలానిపేట అంటేనే తెలుస్తుంది.

మండలంలోని గొద్దుపేట గ్రామాన్ని హనుమంతుపురం అనే పేరుతో పిలుస్తున్నారు. గతంలో గ్రామంలో గొద్దు అనే ఇంటి పేరు కలిగినవారు ఎక్కువుగా ఉండేవారు. ప్రస్తుతం ఆ ఇంటిపేరు కలిగిన పలు కుటుంబాలు ఉన్నప్పటికీ పేరు బాగోలేదని మార్చారు. గ్రామంలో కొన్ని సంవత్సరాలు కిందట ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆ గ్రామాన్ని హనుమంతుపురంగా పిలుస్తూ ప్రభుత్వ దస్త్రాల్లో ఆ విధంగా రాస్తున్నారు.

అలాగే మండలంలోని జి.కె.వలస గ్రామానికి కొత్తపేట అనే పేరు ఉండేది. అయితే గతంలో ఆ గ్రామంలో కొత్తపేట అనే పేరు గల వారు ఉండేవారు. ప్రస్తుతం వారు లేకపోవడంతో జి.కె.వలస (గరిమెళ్లకొత్తవలస) అనే పేరుతో ప్రభుత్వ రికార్డుల్లో పొందుపర్చారు.

మండలంలోని సీపాన చంద్రయ్యపేట గ్రామాన్ని కొండపేట అనే పేరుతో పిలుస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో కొండలు ఉండడంతో కొండల మధ్య గ్రామం కావడంతో కొండపేట అని పిలిచేవారు. అయితే కొండలను పేల్చిరాయిని తరలించడంతో ఆ ప్రాంతంలో కొండలు లేకుండా పోయాయి. దీంతో గ్రామంలో సీపాన అనే ఇంటిపేరుగల వారు ఎక్కువుగా ఉండడంతో సీపాన చంద్రయ్యపేట అనే పేరుతో ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు.

**సరుబుజ్జిలి మండలంలో...**

మండలంలోని రెవెన్యూ రికార్డుల పేర్కొన్న వెంకటనర్సింహపురం గ్రామానికి నక్కలపేటగా మరో పేరు ఉంది. ఈ గ్రామం పక్కనే తాగు, సాగునీటి కోనేరు ఉంది. ఆ కోనేరులో రాత్రింబవళ్లు నక్కలు ఎక్కువుగా ఉండి నివాసం ఏర్పరుచుకుని అరుస్తూ ఉండేవి. దీంతో ఆ గ్రామానికి నక్కలపేట గ్రామంగా పిలుస్తూ ఉంటారని ఆ గ్రామ పెద్దలు చెబుతున్నారు.

అలాగే మండలంలోని పుల్లాజీపేట గ్రామం అసలు పేరు సూర్యనారాయణపురం. ఆ గ్రామంలో పూర్వం పుల్లాజి అనే మహిళ ఉండి గ్రామంలో అభివృద్ధి పనులు చేసేదని గ్రామపెద్దలు చెబుతున్నారు. అలాగే గ్రామ పరిధిలో ఆమె సొంతంగా తివ్వించిన కోనేరుకు పుల్లాజీపేట చెరువుగా నామకరణం చేశారు. కొంత కాలానికి ఆమె గ్రామం విడిచి ఎటో వెళ్లిపోయిందో ఎవరికీ తెలియదు. అప్పటి నుంచి సూర్యనారాయణపురాన్ని పుల్లాజీపేటగా పిలుస్తుంటారని పెద్దలు పేర్కొంటున్నారు. ఇప్పటికీ కొంతమందికి పుల్లాజీపేట అంటేనే తెలుస్తుంది. కానీ సూర్యనారాయణపురం అంటే తెలియని పరిస్థితి.



# ప్రభుత్వ నిర్లక్ష్యంతో అందని సాగునీరు

**ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నీటిమూటలగానే మిగిలిపోతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల తలరాతలు మారడం లేదు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదు. సాగునీరందించేందుకు వసతులు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో వాటిపై దృష్టి పెట్టకపోవడంతో సాగునీరు వృధాగా పోయి నిత్యం రైతున్నలకు సాగునీటి కోసం అవస్థలు తప్పడం లేదు. దీంతో రైతున్నలు సాగునీటి కోసం అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.**

- **ఎండుతున్న జలాశయ ఆయకట్టు భూములు**
- **ఆందోళనలో రైతులు**

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి, బూర్జ**

మండలంలో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు సరుబుజ్జిలి, బూర్జ మండల రైతుల సాగునీటి కష్టాలు తీర్చడానికి వెన్నెలవలస, బొమ్మిక రిజర్వాయర్లు మంజూరు చేశారు. మెట్ట భూములకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన జలాశయాలు నాలుగున్నర ఏళ్లుగా అభివృద్ధికి నిధులు మంజూరు కాకపోవడంతో రైతులకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. ఈ రెండు జలాశయాల కింద ఉన్న భూముల్లో సాగుచేస్తున్న వరి పంట ఎండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలాశయాల్లో నీరు ఉన్నప్పటికీ తూముల ద్వారా పిల్ల కాలువలకు నీరు రాకపోవడంతో రైతులు ప్రతిఏటా పంట పొలాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. బూర్జ మండల పరిధిలోని బొమ్మిక జలాశయం ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉంది. అలాగే సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస జలాశయంతో దీని పరిధిలోని గ్రామాల రైతులకు ఎటువంటి ప్రయోజనాలు దక్కడం లేదు.

వెన్నెలవలస రిజర్వాయర్

బొమ్మిక రిజర్వాయర్

### చుక్కనీరు ఇవ్వని 'బొమ్మిక'

బూర్జ మండలం బొమ్మిక గిరిజన గ్రామం ఎగువ భాగంలో గజిలి గడ్డపై బొమ్మిక జలాశయం ఉంది. జలాశయం ద్వారా ఎనిమిది వందల ఎకరాల్లో 565 మంది రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు రూ.130 లక్షల అంచనాతో 1988లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేపట్టారు. 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో కురిసే వర్షపునీటిని జలాశయంలోకి మళ్లించి కొండపేట, మదనాపురం, పెద్ద పేట, జగన్నాధపురం, అప్పలపేట తదితర గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అప్పట్లో ఈ రిజర్వాయర్ నిర్మించారు. జలాశయం మట్టికట్ట పొడవు 340 మీటర్ల వెడల్పు. 300 మీటర్ల పొల్లు కట్ట, పొడవు 34 మీటర్ల పరిధితో నిర్మించారు. జలాశయానికి అమర్చిన రెండు మధుములు నాణ్యత దెబ్బ తినడంతో లీకులతో నీరు వృధాగా బయటకు పోతుంది. రిజర్వాయర్ పరిధిలో పంట పొలాలకు చుక్కనీరు అందని పరిస్థితి నెలకొంది. పాలకొండ నుంచి సరుబుజ్జిలి వచ్చే. దారి ఎడమవైపు ఉన్న రెండు జలాశయాలు పర్యాట కులు చూడడానికి తప్ప నాలుగున్నర ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక పోవడంతో జలాశయాలు ఉపయో గపడితే ఒట్టు అంటూ రైతులు వాపోతున్నారు.

### నిరుపయోగంగా వెన్నెలవలస జలాశయం

సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన గ్రామం ఎగువ భాగంలో నిర్మించిన జలాశయం రైతులకు నిరాశనే మిగులుస్తోంది. ఐరోపా ఆర్థికసాయంతో 1987 ఆగస్టు 24న అప్పటి రాష్ట్రమంత్రి కెఇ కృష్ణమూర్తి ఈ జలాశయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీటిని జలశయానికి మళ్లించి సరుబుజ్జిలి మండలంలోని 12 గ్రామాలకు సాగునీరు అందించాలని అప్పటి ప్రభుత్వ ఉద్దేశం. వెన్నెలవలస, శ్రీరామవలస మధ్య రెండు కొండల నడుమ నాలుగు వందల మీటర్ల గట్టు నిర్మించారు. జలాశయానికి ఇరువైపులా కుడి, ఎడమ కాలువలు నిర్మించి తూములు ఏర్పాటు చేసి 12 గ్రామాలకు చెందిన సుమారు 350 ఎకరాలకు సాగునీరు అందిం చడం జరిగింది. ప్రస్తుతం. జలాశయం గట్టు ముళ్లపొదలతో నిండిపోగా, పిల్ల కాలువ తూములు అధ్వాన స్థితికి చేరుకొని దిగువ భూములకు సాగునీరు అందడం లేదు. జలాశయం కింద భూముల్లో ఉన్న వరిపైరు ఎండిపోతున్నాయని వెన్నెల వలస, శ్రీరామువలస, మత్రిపాడు, బురిడి వలస, చిగురువలస, మూల సవలాపురం, సింధువాడ, సలంత్రి గ్రామాల రైతులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వెన్నెలవలస రిజర్వాయర్‌కు వేసిన శిలాఫలకం



వృథాగా పోతున్న సాగునీరు

పాడైన తూములు

# కనువిందు... జాలువారే సెలయేరు

**కనువిందు చేసే ఎత్తయిన కొండలు. జలజలమని జాలు వారే సెలయేరు... చుట్టూ పచ్చని పైరు హోరు... గాలులు, పక్షుల కిలకల రావాలు... ఇవన్నీ వింటే ఊటీ, కొడైకెనాల్, అరుకు తదితర ప్రాంతాలు మనకు టక్కున గుర్తొస్తాయి. అయితే మండలంలోని ప్రకృతి ప్రసాది ంచిన ఓ జలపాతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలు...**

**ప్రజాశక్తి- బూర్జ**

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, జిల్లాలోని మెళియాపుట్టి మండలం ఒడిశా సరిహద్దు ప్రాంతం ఇప్పటికే ప్రకృతి ప్రేమికులకు ఆకట్టుకున్నాయి. పర్యాటక కేంద్రంగా కూడా ఎంతగానో అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం బూర్జ మండలం లక్కుపురం పరిధిలోని కొత్తవలస గిరిజన గ్రామం నేడు ప్రకృతి ప్రేమికులకు ఎంతగానో ఆకర్షితమవుతుంది. అందుకు కారణం ఈ ప్రాంతంలో ఈ ప్రకృతి సిద్ధమైన అందాలు దర్శనమిస్తుంది. ఇంతవరకు ఈ ప్రాంతంలో మినీ రిజర్వాయరు ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే అక్కడి నుంచి కిలోమీటర్ దూరం వెళ్తే కొన్ని కనువిందు చేసే అందాలు కనిపిస్తున్నాయి. దీనిని ప్రకృతి ప్రేమికులు గుర్తించడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే... ఆదాయంతో పాటు ఈ ప్రాంతం గుర్తింపు కూడా వస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కొండ కోనల నుంచి జారు వారుతున్న జలపాతం, చుట్టూ ప్రకృతి సోయగాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అలాగే దగ్గరలో కోనేరు ఉంది. ఇక్కడా కూడా పార్కుగా ఏర్పాటు చేస్తే ఆదాయ వనరులు చేకూర్చవచ్చునని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు.

### ఇలా వెళ్లాలి....

మండలంలోని లక్కుపురం కూడలి వద్ద ముక్కిది పోలమ్మ ఆలయం నుంచి పాలకొండ – శ్రీకాకుళం సిఎస్‌పి రహదారిని ఆనుకుని రెండు కిలోమీటర్లు కొత్తవలస వెళ్లాలి. గ్రామ సమీపంలో మినీ రిజర్వాయరు ఉంది. అక్కడి నుంచి మరో కిలోమీటర్ దూరం వెళ్తే... ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. పైన చెప్పిన ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు.

# ఆహ్లాదం కనుమరుగు...

- అధ్వానంగా తయారు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ఇదీ పొందూరు నెహ్రూ పార్కు దుస్థితి

పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, పాడైపోయిన చిన్నారుల జారుడుబల్ల

ప్రజాశక్తి- పొందూరు

ఉరుకులు...పరుగులే మానవ జీవన శైలిగా మారిన ప్రస్తుత తరుణంలో ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయి. పగలంతా కష్టపడడంతో అలసి, సొలసి సాయంత్రం వేళ కాస్తా ఆహ్లాదం కోసం పార్కుకు వెళ్లాలని అనిపిస్తుంది. ఒత్తిడి నుంచి విముక్తి పొందడానికి, పిల్లలకు ఆటపాటల వాతావరణం కల్పించడానికి, వృద్ధులకు ప్రశాంత వాతావరణం అందించడానికి పార్కులు ఎంతో అవసరం. అయితే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంకు గురై పార్క్‌లు అధ్వాన్నంగా తయారవుతున్నాయి. మేజరు పంచాయతీ పొందూరు పట్టణ ప్రజలకు దశాబ్దాలుగా ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించిన నెహ్రూ పార్కు కళాహీనంగా మారి అధ్వాన్నంగా తయారైంది. దీంతో పార్కు అభివృద్ధికి కృషి చేయాలంటూ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో పొందూరు ఒకటి. సుమారు 4 వేలు గృహాలు, సుమారు 16 వేలు జనాభా కలిగిన ఈ పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు మౌళిక సదుపాయాలతో కూడిన పార్కు లేకుండా పోయింది. ప్రపంచ వ్యాప్తంగా ఖాదీ వస్త్రాల పేరు చెబితే చాలు గుర్తుకు వచ్చేది పొందూరు. అలాంటి పట్టణ వాసులకు ఆహ్లాదం కరువైందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అసాంఘిక కార్యకళాపాలకు చిరునామా**

పట్టణంలో 1964లో అప్పటి సర్పంచ్ పాలిశెట్టి సూర్యం ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో నెహ్రూ పార్కు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పట్టణ ప్రజలకు ఆహ్లాదరకమైన వాతావరణాన్ని అందించిన ఈ పార్కు క్రమేణ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అధ్వాన్నంగా మారింది. ప్రస్తుతం పార్కు చెత్తాచెదారాలతో అధ్వాన్నంగా, కళాహీనంగా తయారై అసాంఘిక కార్యకళాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడిందంటే చాలు అసాంఘిక కార్యకలాపాలకు చిరునామాగా మారుతుంది. సమీపంలోనే మద్యం విక్రయ దుకాణాలు ఉండడంతో మందుబాబులకు పార్కు ఆశ్రయంగా మారింది. దీంతో పార్కుకు వచ్చేవారికి విరిగిపోయిన కుర్చీ బల్లలు, పిచ్చిమొక్కలతో పాటు మద్యం సీసాలు ఎక్కడ పడితే అక్కడే చెల్లాచెదురుగా పడి దర్శినమిస్తుంటాయి. మారుతున్న కాలానుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న పాలకులు, అధికారులు పార్కుల నిర్మాణంపై మాత్రం దృష్టి సారించడం లేదు. సాయంత్రం వేళ విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఆడుకునేందుకు, ఆహ్లాదం పొందేందుకు అనువుగా పార్కు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. సుమారు 16 వేలు జనాభా ఉన్న పట్టణవాసులకు కనీసం ఒక్క పార్కు కూడా లేకపోవడం దారుణమంటూ ప్రజలు ఆవేద చెందుతున్నారు.

పార్కులో విరిగిన కుర్చీ బల్లలు

**హామీలతో సరిపెడుతున్నారు**

మేజర్ పంచాయతీలో అధికారికంగా ఏ సమావేశం నిర్వహించాలన్నా నెహ్రూ పార్కులోనే జరుపుతారు. ఆ సమావేశం సమయంలో పార్కు దుస్థతిని చూసిన పాలకులు పార్కు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామంటూ హామీలను గుప్పిస్తారే తప్ప అవి ఆచరణకు నోచుకోవడం లేదంటూ పట్టణ వాసులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ సమావేశానికి హాజరైన అప్పటి ఎంపీ, ప్రస్తుత కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రూ.10 లక్షలు ఎంపీ నిధులతో పార్కు అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నోఏళ్లు గడిచినా ఆ ప్రకటన నేటికీ ఆచరణకు నోచుకోలేదంటూ ప్రజలు వాపోతున్నారు. పట్టణ వాసులకు ఆహ్లాదం అందించేలా పార్కు అభివృద్ధికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నెహ్రూ పార్కు

**పార్కు సంరక్షణ అందరి బాధ్యత**

పార్కు సంరక్షణ ప్రతిఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలి. పార్కు సజీవం గా మారాలంటే దాని సంరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. చెట్లు, పూలమొక్కలు నాటడం, క్రీడీ సామగ్రికి మరమ్మతులు చేయడం, పార్కు శుభ్రతను క్రమం తప్పకుండా నిర్వహించడం చేయాలి.

**- వెంకటేష్, గ్రంథాలయాధికారి**

**పార్కు అభివృద్ధికి కృషి చేయాలి**

పట్టణంలోని నెహ్రూ పార్కుకు ఆరు దశాబ్దాల చరిత్ర ఉంది. పట్టణ ప్రజలకు ఆహ్లాదరమైన వాతావరణాన్ని అందించేది. ప్రస్తుతం ఇది కళాహీనంగా మారి అసాంఘిక కార్యకళాపాలకు అడ్డాగా మారింది. సాయంత్రం వేళ విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఆహ్లాదం అందించేందుకు పార్కును అభివృద్ధి చేయాల్సి ఉంది. పార్కు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

**- కె.సాయికుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు, పొందూరు**

పార్కులో విచ్చలవిడిగా పడి ఉన్న మద్యం సీసాలు

# ప్రజలకు సౌకర్యమా... శాపమా..?

- చెరువులను తలపిస్తున్న రైల్వే అండర్ పాసేజ్‌లు
- వర్షాకాలంలో రాకపోకలకు నానా అవస్థలు
- ఇదీ నియోజకవర్గంలోని దుస్థితి

ప్రజాశక్తి- పొందూరు

ప్రయాణికులు, వాహనదారులుకు రైల్వేగేటు కష్టాల నుంచి బయట పడేందుకు, రైలు రాకపోకలు సమయంలో నిరీక్షణ లేకుండా ఉండేందుకు అనువుగా ఉండేలా రైల్వే అండర్ పాసేజ్‌లను రైల్వేశాఖ అధికారులు చేపట్టారు. రైల్వే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలు సాగిపోవడానికి నిర్మించిన రైల్వే అండర్ పాసేజ్‌లు నేడు ప్రయాణికుల ఇబ్బందులకు కేంద్రమవుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తూ వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది ఆమదాలవలస నియోజకవర్గంలోని రైల్వే అండర్ పాసేజ్‌ల దుస్థితి.

ఆమదాలవలస నియోజకవర్గం పరిధి లోని పొందూరు మండలంలోని పెనుబర్తి, బొడ్డేపల్లి, ఆమదాలవలస మండల ంలోని ఆమదాలవలస పట్టణం, కనుగులవలస వద్ద రైల్వే లైన్ క్రాసింగ్ వద్ద రైల్వే అండర్ పాసేజ్‌లను అధికారులు నిర్మించారు. వర్షాకాలం వస్తే చాలు చిన్నపాటి వర్షం కురిస్తే అండర్‌పాసేజ్‌లు వద్ద నీరు పెద్దఎత్తున నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ప్రతీఏటా ఇదే పరిస్థితి నెల కొనడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వాహన దారులు, ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు నిలిచిపోవడం వలన వాహనాలు మునిగిపోయి నడిచేందుకు మొరాయిస్తున్నాయి. వాహనాలు వేగంగా పాడైపోయి వాటి మరమ్మతులకు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తున్నదంటూ వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్ పాసేజ్‌లు వద్ద లైటింగ్ సమస్య కూడా ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు పడు తున్నామంటూ వాహనదారులు వాపోతున్నారు.

బొడ్డేపల్లి వద్ద గోతులు పడిన అండర్ పాసేజ్

**పంపింగ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం**

ఈ రైల్వే అండర్ పాసేజ్‌లు వద్ద నిలిచిపోయిన వర్షపు నీటిని బయటకు పంపించేందుకు ఏర్పాటు చేసిన పంపింగ్ వ్యవస్థ సక్రమంగా లేదు. నీటిని బయటకు పంపే పంపుల ఏర్పాటు, శాశ్వత డ్రైనేజీ లైన్ల నిర్మాణం, అండర్ పాసేజ్‌ల శుభ్రత వంటి పనులను సక్రమంగా నిర్వహించాలి. అండర్ పాసేజ్‌ల్లోకి చేరిన వర్షపునీరు ఎప్పటికప్పుడు బయటకు పోయేలా తగు చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా వర్షపునీరు నిలిచిపోవడం వలన గోతులు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే నీరు ఎక్కువుగా చేరిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి అత్యవసర సేవలు అందించే అంబులెన్స్‌లు సైతం రాకపోకలు సాగించలేక ప్రజలు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

పెనుబర్తి వద్ద చెరువును తలపిస్తున్న రైల్వే అండర్ పాసేజ్

**అధికారుల నిర్లక్ష్యం**

వర్షాకాలం వచ్చిందంటే చాలు అండర్ పాసేజ్‌ల్లో నీరు నిలిచిపోవడం వంటి సమస్య తలెత్తుతుంది. దీనికి అధికారులు తాత్కాలిక చర్యలతో నీటిని బయటకు పంపించి మళ్లీ మరిచిపోయే ధోరణి కనబడుతున్నది. మరలా వర్షాకాలం వస్తేనే ఆ సమస్య వారికి గుర్తొస్తుంది. దీనికి సంబంధించి శాశ్వత పరిష్కారంపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా ప్రజల పన్ను డబ్బుతో నిర్మించిన అండర్ పాసేజ్‌లు వారికి సౌకర్యంగా కాక భారంగా మారుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు సక్రమమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాల్సిన అవసరం రైల్వేశాఖ అధికారులు చేపట్టాలంటూ ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

చెట్ల కిందే

# క్రీడా మైదానాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పలు పాఠశాలలకు క్రీడ మైదానాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ మండలంలో 8 జిల్లా పరిషత్ హైస్కూళ్లతో పాటు కెజిబివి ఆదర్శ పాఠశాల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. సుమారు 2,700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో కురుంపేట, కొల్లివవలసలోని కెజిబివి, తోటవాడ, ఉప్పినివలస, మామిడివలస, పాలవలసల గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలకు కనీస మైదాన సదుపాయం లేకపోవడం శోచనీయం. విద్యార్థులకు ఆటలపై ఆసక్తి ఉన్నా మైదానాలు సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు చదువులతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించి అన్ని పాఠశాలకు పిఇటిలను నియముంచడమే కాకుండా క్రీడా పరికరాలను అందించేందుకు చర్యలు తీసుకుంది. అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లుగా పాఠశాలలో కొంత మేర పిఇటిలు ఉన్నా. ఆట మైదానాలు లేకపోవడంతో తాము క్రీడల్లో నైపుణ్యం ఎలా సాధించాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తాము క్రీడల్లో రాణించాలని ఉందని, అయితే మైదానం లేకపోవడంతో ఎక్కడ ఆడుకోవాలో తెలియని పరిస్థితి ఎదురవుతుందని విద్యార్థులు వాపోయారు. ముఖ్యంగా మండలంలోని కె.కె.రాజపురం పాఠశాల విద్యార్థులు కళ్లాల్లో, సిసి రోడ్డును మైదానాలుగా ఉపయోగించుకొని విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు. మండలంలోని కె.కె.రాజపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాటశాల ప్రారంభించి రెండు దశాబ్దాలు అవుతునా... కనీస ఆటస్థలం లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు సుమారు 160 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. విద్యార్థుల్లో ఉన్న ఆసక్తిని గమనించి పాఠశాలలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ పిఇటి విద్యార్థులకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలకు సమీపంలోని కళ్లాలను క్రీడా స్థలంగా తీర్చిదిద్దారు. ఆనాటి నుంచి విద్యార్థులకు ఆ మైదానంలోనే వివిధ ఆటలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రామంలోని సిసి రోడ్లపై పరుగులెత్తించి రన్నింగ్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా 2016లో గుడివాడలో నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో చంద్రుడమ్మ బ్రాండ్ మోడల్స్ సాధించింది. అలాగే రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ఈ పాఠశాలలో చదివిన ఎస్.కుమారి, జి.చంద్రిక విద్యార్థులు మెడల్స్ సాధించారని పిఇటి అప్పన్న తెలిపారు. పాఠశాలకు సరైన క్రీడామైదానం ఉంటే జాతీయస్థాయి క్రీడాకారులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు స్పందించి పాఠశాలకు క్రీడామైదానం సదుపాయం కల్పించేందుకు అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

# రైతు అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

రైతులకు శాస్త్ర సాంకేతిక రంగాల పరంగా రైతులకు అండగా కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుంది. జిల్లా కేంద్రంలోని 12 కిలోమీటర్ల దూరంలో ఆమదాలవలసలో కృషి విజ్ఞాన కేంద్రం 1985 జనవరి 1న ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వారిచే స్థాపించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ పరిశోధన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి పనిచేస్తుంది. వ్యవసాయంలో రైతులకు గ్రామీణ యువతకు, మహిళలకు వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని, ఆదాయాన్ని పెంపొందించే దిశగా పనిచేస్తుంది. కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన భవనం, శిక్షణ భవనం, అద్దెకు వ్యవసాయ యంత్ర పరికరాల నిర్వహణ భవనం, సీడ్ హబ్, భూసార పరీక్షల ప్రయోగశాల, గృహ విజ్ఞాన ప్రయోగశాల, రైతులు వ్యవసాయ మహిళలు, విస్తరణ కార్యకర్తలకు వివిధ విస్తరణ కార్యకలాపాలు నిర్వహించడానికి రైతుల వసతి గృహం వంటి మౌలిక సదుపా యాలు ఉన్నాయి. ఈ మౌలిక సదుపాయాలతో పాటు విన్నూతన వ్యవసాయ సాంకేతికతలను ప్రదర్శించడానికి షేడ్ నెట్ నర్సరీ, క్రాప్ మ్యూజియం, పుట్టగొడుగుల పెంపకం యూనిట్, పౌల్ట్రీ యూనిట్, వాతా వరణ కేంద్రం, వర్మికంపోస్టు యూనిట్, అజోల్ల ఉత్పత్తి యూనిట్, ఎన్ఎడిఇపి కంపోస్టు, సమీకృత వ్యవసాయ విధానాల యూనిట్, చేపల చెరువు, పోషకాహార తోట, మిద్దె తోట, వంటి వాటిపై ప్రదర్శన యూనిట్లనూ కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తోంది. డ్రమ్ సీడర్ టెక్నాలజీతో 650 ఎకరాల విస్తీర్ణంలో వరిని నేరుగా విత్తడం జరిగింది. 13 మండలాల్లో 380 మంది రైతులు ఈ సాంకేతికతను అవలంబించడం ద్వారా సాగు ఖర్చు తగ్గి దిగుబడి వల్ల రూ.9.75 లక్షలు అదనపు ఆదాయాన్ని పొందారు.

శక్తి, వనరులు పరిరక్షణపై సాంకేతికత – వరిలో దున్న కుండా మొక్కజొన్న సాగును 31, 600 ఎకరాల విస్తీర్ణంలో పండించాం. జిల్లాలో 32,650 మంది రైతులు ఈ సాంకేతికతను అవలంబించారు. భూమి తయారీ, నీటిపారు దల, దిగుబడి ప్రయోజనా లపై పొదుపు ద్వారా రూ.4,82,50,000 అధిక ఆదాయాన్ని పొందారు. వరిలో వ్యవసాయ కూలీల కొరత పరిష్కరించడానికి ఉత్పాదకతను పెంపొందించడానికి యాంత్రికరణ శ్రీవరి పద్ధతి 1100 ఎకరాల విస్తీర్ణంలో వేశారు. జిల్లాలో 300 మంది రైతులు 13 మండలాల్లో ఈ సాంకేతికతను అవలంబించారు. విత్తన, కూలీ ఖర్చు, విత్తన మోతాదు, దిగుబడి ప్రయోజనంపై పొదుపు ద్వారా అదనంగా రూ.23,16,250 అధిక ఆదాయాన్ని పొందారు.

## ప్రధాన కార్యకలాపాలు

- పరిశీలన క్షేత్రాలు నిర్వహించడం
- ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను నిర్వహించడం
- రైతులకు గ్రామీణ యువతకు, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు.
- వ్యవసాయశాఖ అనుబంధ రంగాలు, స్వచ్ఛంద సంస్థలకు వ్యవసాయ సాంకేతిక విస్తరణ కేంద్రంగా వ్యవహరిస్తుంది
- నూతన వంగడాలు, నారు ఉత్పత్తి, జీవ నియంత్రకాలు, వివిధ కీలక ఉపకరణాలను రైతులకు అందిస్తుంది.
- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాంకేతికత విస్తరణకు వివిధ రకాల విస్తరణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అక్షర సత్యాలతో - అభ్యుదయ భావాలతో సామాజిక చైతన్యాన్ని రగిలిస్తూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షం నినాదంతో ముందుకు వెళ్తున్న ప్రజాశక్తి దినపత్రికకు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
డా॥ సి.హెచ్. మాధురి
మెడికల్ ఆఫీసర్, దూసి PHC, ఆమదాలవలస మండలం.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అక్షర సత్యాలతో - అభ్యుదయ భావాలతో సామాజిక చైతన్యాన్ని రగిలిస్తూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షం నినాదంతో ముందుకు వెళ్తున్న ప్రజాశక్తి దినపత్రికకు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మెడికల్ ఆఫీసర్
తొగరాం PHC, ఆమదాలవలస మండలం.

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం చేస్తున్న ప్రజాశక్తికి 45వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
ఎం. శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ, కొంచాడ.
బి.వి.ఎస్. ప్రకాస్‌రావు VRO
ఎన్. సరోజిని Welfare & Education Asst
ఎస్. ధనలక్ష్మి Veterinary Assistant
వి. సునీత Mahila Police
వై. సూర్యం ANM
ఎ. మనీషా VAA
డి. సంతోష్ కుమార్ JLM
పి. రామచంద్రరావు DA
కె. నాగేశ్వరరావు VSA
కొంచాడ సచివాలయం, పొందూరు మండలం

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పదునైన పదాలతో నిరంతరం ప్రజల పక్షాన వార్తలు రాస్తూ... అంచెలంచెలుగా ఎదుగుతూ... 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న 'ప్రజాశక్తి' దినపత్రికకు శుభాకాంక్షలు
ఎం. శ్రీనివాసుల నాయుడు, APO, రణస్థలం
బి. పార్వతి, APO, రణస్థలం
ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం
రణస్థలం మండలం.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం ప్రజల పక్షం... ప్రతి పదం ప్రజా హితం... ప్రతి నిత్యం ప్రజా సంక్షేమం కోసం... అక్షర సమరం సాగిస్తున్న ప్రజాశక్తికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కిల్లి ఉషారాణి, ఎం.పి.పి, పొందూరు
మీసాల మన్మధరావు, ఎం.పి.డి.ఒ, పొందూరు

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
"ప్రతి అక్షరం - ప్రజల పక్షం" అంటూ ప్రజల సమస్యలను పత్రికా ముఖంగా తెలియజేస్తూ... నేడు 45వవసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా ఇవే మా హార్దిక శుభాకాంక్షలు...
దాసిరెడ్డి మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు
ఏన్ని గీత, డైరెక్టర్.
రాగోలు క్రిష్ణ, డైరెక్టర్.
వాలుపల్లి స్వామినాయుడు, డైరెక్టర్.
సీవర అప్పన్న, డైరెక్టర్.
దూబ బాలకృష్ణ, అధ్యక్షులు
కొండపేట సాగునీటి సంఘం - కొండపేట

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజా సమస్యలపై నిరంతరం అక్షర సమరం సాగిస్తూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షంగా దినదినాభివృద్ధి చెందుతున్న ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పప్పల శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ
పి. శ్రీదేవి D.A
మద్ది సంతోషరావు W.E.A
ఎం. శంకరరావు V.R.O
ఎస్. నర్సింగరావు V.S
కె. శాంతికుమారి A.N.M
డి. స్రవంతి W.P.S
కె. సురేష్ J.L.M
సి.హెచ్. భారతి D.A
పి. మీనాక్షి W.E.A
ఎస్. మనోజ్ E.N.A
ఎం. శంకరరావు V.R.O
వి. క్రాంతి V.S
బి. ఉషారాణి A.N.M
టి. గుణవతి W.P.S
సి.హెచ్. రాజశేఖర్ J.L.M
రాపాక సచివాలయాలు 1,2 - పొందూరు మండలం

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం ప్రజల పక్షం... ప్రతి పదం ప్రజా హితం... ప్రతి నిత్యం ప్రజా సంక్షేమం కోసం... అక్షర సమరం సాగిస్తున్న ప్రజాశక్తికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జి. శ్రీరాములు, ఎం.ఈ.ఓ-1, పొందూరు మండలం
పి. రాజారావు, ఎం.ఈ.ఓ-2, పొందూరు మండలం

ముళ్లపొదలు, పిచ్చి మొక్కల మధ్య నిరూపయోగంగా ఉన్న అమరావతి పార్కు

పిచ్చి మొక్కల మధ్య వాకింగ్ ట్రాక్



# ఆహ్లాదం కరువాయే

**● గాలికి వదిలేసిన ఉద్యానవనాలు ● కనుమరుగైన పిల్లల ఆట వస్తువులు**

ప్రజాశక్తి- ఆమదాలవలస

నగరాన్ని అందాలవలసగా తీర్చిదిద్దుతామని పట్టణంలోని పెద్ద చెరువులో బోటు షికారును ఏర్పాటు చేసి ఆహ్లాదాన్ని అందిస్తామని పదే పదే వైసిపి ఓ మాజీ సీనియర్ నేత చెప్పేవారు. బోటు షికారు మాట అటు ఉంచితే పట్టణంలో అప్పటికే ఉన్న ఉద్యానవనాలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక ఉద్యానవనాల నిర్వహణ మాటే మరిచారు. పట్టణం అంటే ఆధునిక వసతులు మౌలిక సౌకర్యాలతో పాటు విశ్రాంతి తీసుకునేందుకు పార్కులు, ఆట స్థలాలు తదితర వసతులు సమకూర్చుతారు. 2019 ముందు వరకు పట్టణంలో ఐదు ఉద్యానవనాలు ఉండేవి. పట్టణంలో బిఆర్ నగర్‌లో అమరావతి పార్క్, మోణింగి వారి వీధిలో భగత్ సింగ్ నెహ్రూ పిల్లల ఉద్యానవనాలు, రామలింగేశ్వర పార్క్, పారిశ్రామిక వాడ వద్ద ట్రయాంగిల్ పార్క్, వెంకయ్య పేటలో కోనేరు ఉద్యానవనాలు ఉండేవి. ఒకానొకనాడు జనావాసాలతో అందంగా ఆహ్లాదంగా ఉండే ఉద్యానవనాలు నేడు మురికి కూపాలుగా గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారాయి. ఉద్యాన వనాలలో విద్యుత్ సరఫరా లేకపోవడం, విష సర్పాలకు నిలయాలుగా మారడంతో ప్రజలు ఎవరు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గతంలో సాయంత్రం అయ్యేసరికి జనాలతో కళకళలాడేవి. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఉద్యానవనాల్లో పిల్లల ఆట వస్తువులు, కూర్చోడానికి బెంచీలు, నడక ట్రాక్లు, వివిధ రకాల మొక్కలను పెంచి ఆహ్లాదకరంగా తయారు చేశారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యానవనాల నిర్వహణను గాలికి వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు, జంతువులకు ఆవాసాలుగా ఉద్యాన వనాలు మారాయి. ఉద్యానవనాల్లోకి అడుగుపెడితే ముళ్లపొదలు, పాముల పుట్టలు ప్రస్తుతం దర్శన మిస్తుండడంతో పట్టణవాసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పెద్దలు, పిల్లలు ఆటవిడుపు ఆహ్లాదానికి దూరంగా ఉండాల్సి వస్తుందంటూ పురవాసులు వాపోతున్నారు. చిన్నారుల పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత ఉద్యానవనంలో గడిపే సమయం వారి మానసిక వికాసానికి దోహదపడుతుందని పలువురు చెబుతున్నారు. పార్కుల నిర్వహణపై మున్సిపల్ అధికారులకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఈ ఉద్యానవనాలను చూస్తే అర్థమవుతుందని పలువురు సీనియర్ సిటిజన్లు పెదవి విరుస్తున్నారు. పట్టణంలో పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు వ్యాహ్యాళికి చెప్పుకోదగిన పార్కు ఒక్కటి లేకుండా పోవడం పట్టణ వాసుల దౌర్భాగ్యమని పలువురు అధికారులు నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దైనందిన జీవితంలో బిజీబిజీగా గడిపే ప్రజలు సాయంత్రం వేళ సేద తీరేందుకు సరైన ఉద్యాన వనాలు లేక ఉన్న పార్కుల పరిస్థితి అధ్వానంగా ఉండి వాటి నిర్వహణను పురపాలక సంఘ అధికారులు గత కొన్నేళ్లుగా విస్మరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేసి ఉద్యానవనాలను అభివృద్ధి చేయాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పిచ్చి మొక్కలు, పాముల పుట్టల మధ్య బుద్ధుడు విగ్రహం

పిచ్చి మొక్కల మధ్య బెంచి

కళావిహీనంగా మారిన నెహ్రూ చిల్డ్రన్ పార్కు

ఆకారం మారిన నెహ్రూ విగ్రహం

# సమస్యలతోనే సహవాసం

**● గిరిజనుల జీవనం దుర్భరం**
**● అభివృద్ధికి ఆమడ దూరం**
**● సౌకర్యాల లేమితో సతమతం**

**చుట్టూ కను విందు చేసే ఎత్తయిన కొండలు.. మనసును ఆహ్లాద పరిచే పైరగాలి, కొండల నుంచి జారువారే నీటి సవ్వడి ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆహ్లాదపరుస్తుంది. కళ్లకు ఆకట్టుకుని మూడు కొండల నడుమ కనీస సౌకర్యాలు లేకపోవడంతో గిరి పుత్రులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు.**

ప్రజాశక్తి బూర్జ

మండలంలోని జంగాలపాడు పంచాయతీ పరిధిలో ఉన్న చిన్న చలం గ్రామం. మండలంలోని కొన్ని గ్రామాల నుంచి బతుకు భారమై జీవనోపాధి కోసం పొట్ట చేత పట్టుకుని 15 సంవత్సరాల క్రితం ఈ మూడు కొండల నడుమ నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కాయ కష్టం చేసుకుని పోడు వ్యవసాయంతో కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు.

2014వ సంవత్సరంలో ఏనుగులు సంచరిస్తూ బీభత్సాన్ని సృష్టించాయి. దీంతో గిరిజనులు భయాందోళనకు గురై జంగాలపాడు పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్లపాడు గ్రామానికి చేరుకున్నారు. ఐదేళ్ల తర్వాత 2018వ సంవత్సరంలో తిరిగి కొండ ప్రాంతానికి చేరుకున్నారు.

## చలమ పేరు ఇలా వచ్చింది...

కొండపై తాగునీటికి ఇతర అవసరాలకు కొండపై నుంచి కిందకి జారువారే నీటిని చలమల ద్వారా లభించే నీటిని వినియోగించేవారు దీనివలన ఈ గ్రామానికి చలం అని పేరు పెట్టుకున్నారు. చలమల నుంచి వచ్చే నీటిని తమ నివాసానికి తీసుకువచ్చేందుకు సీతంపేట ఐటిడిఎ అధికారులను సంప్రదించారు. అంతకుముందు గ్రామస్తులు తలో చెయ్యి వేసుకుని రూ.1.50 లక్షల వ్యయంతో చలమల నుంచి పైప్‌లైన్ వేసుకున్నారు. ఈ విషయాన్ని అప్పటి సీతంపేట ఐటిడిఎ పిఒ నవ్య దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన పిఒ నవ్య నీటిని నిల్వ చేసుకునేందుకు వాటర్ ట్యాంక్‌ను మంజూరు చేశారు. గ్రామానికి విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

## కొండల నడుమ రహదారి...

తమ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో కొండల పక్కనుంచి రాకపోకలు సాగిస్తుండేవారు. ఈ విషయాన్ని అప్పటికి పిఒ నవ్య దృష్టికి గిరిజనులు తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన పిఒ నవ్య పలు సందర్భాల్లో నడుచుకుంటూ ఈ ప్రాంతానికి చేరుకున్నారు. రహదారి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో ఎన్నికలు రావడంతో పిఒ బదిలీ కావడంతో తమకు నడక కష్టాలు తీరలేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామంలో ఎవరికైనా రోగం వస్తే కాలినడకన తీసుకోవాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.

మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్న చిన్న చలం

## బడులకు దూరం...

గ్రామంలో అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాల లేదు. దీంతో గ్రామంలోని పిల్లలు విద్యకు దూరం అవుతున్నారని గిరిజనుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లారు. అయితే ఇంతవరకు గ్రామానికి ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యను పరిష్కరించి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామంలోని గిరిజనులు కోరుతున్నారు.

### రహదారి లేక అవస్థలు...

కొండల నడుమ ఉన్న తమకు రహదారి లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాం. అత్యవసర సమయంలో కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

**- సవర సుధారాణి**

### సౌకర్యాలు కల్పించాలి

గ్రామంలో సమస్యలు తాండవిస్తున్నాయి. రేషన్‌డిపో, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం వంటివి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా వైద్యం అందడం లేదు. రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

**- సవర అరవింద్**

# నరక రహదారులు

- ఇబ్బందుల్లో ప్రజలు
- కూటమి పాలన ఏడాదైనా రోడ్ల పురోగతి శూన్యం

**ప్రజాశక్తి- లావేరు**

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అనే సూక్తిని ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ తరచుగా వల్లిస్తుంటారు అయితే దానికి విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉన్నాయి. ప్రజాపాలకులు పాలనలో గ్రామాల్లో ప్రజలు రాకపోకలు సాగించేందుకు సరైన రహదారులు లేక ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ప్రజలు నరక రహదారులతో నిత్యం నరకాన్ని చూస్తున్నారు. నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో మట్టిరోడ్లుతో దమ్ముమడిని తలిపి స్తూన్నాయి. చినుకు పడితే చిత్తిడి చిత్తిడయ్యే పరిస్థితి కనిపిస్తుంది. ప్రస్తు తం విస్తారంగా ఎడ తెరిపి లేని భారీ వర్షాలు పడుతుండటంతో రహదారులు బురద, గోతులమయమై రోడ్డుపై వాహనాల రాకపోకలు, ప్రజలు కాలినడకన రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి పాలనలో అప్పటి ప్రభుత్వం రహదారులను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని తరచూ విమర్శించే నాటి ప్రతిపక్షం, నేటి కూటమి అధికార ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పైబడినా రోడ్ల పరిస్థితి, ప్రజల జీవన ప్రమాణాలు ఏమాత్రం మార్పులేదు. గ్రామాలకు చేరాలంటే వడరాని పాట్లు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రాముని పాలెం నుంచి గోవిందపురం వెళ్లే రోడ్డు

లావేరు మండలంలోని గురుగుబిల్లి నుంచి బట్టుపాళెం మీదగా కొత్తకోట రోడ్డు మోకాళ్లలోతు బురదతో వాహనాల రాకపోకలు సాగించలేక, ప్రజలు నడవడానికి కూడా వీలులేని పరిస్థితిలో బట్టుపాళెం, కొత్తకోటతో పాటుగా సుమారు 15 గ్రామాల ప్రజలు నరకం చూస్తున్నారు. అలాగే తాళ్లవలస, వేణుగోపాలపురం, నాగంపాళెం, గుమ్మడాం, రమునిపాళెం, గోవిందపురం, మురపాక, సహపురం, తాళ్లావలస, బొడ్డపాడు రోడ్డు, కూనపువానిపేట, నక్కపేట రోడ్డు, రణస్థలం మండలంలోని తెప్పలవలస, పాపారావుపేట రోడ్డు, పాపారావుపేట, సీతారాంపురం, పాతర్లపల్లి, మీసాలబడి రోడ్డు, జి.సిగడాం మండలంలోని గేదులపేట, టిడి వలస, సేతుభీంవరం, గెడ్డకంచారం, ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం, పెద్దరుప్పపేట, చిన్నకొంగరాం, పెద్దకొంగరాం గ్రామాల రోడ్లుది అదే పరిస్థితి. ఇటువంటి గ్రామాల్లోకి అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ వెళ్లాలన్నా కత్తిమీద సామే. మరికొన్ని చోట్ల రహదారుల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ ప్రోగ్రామ్ క్రింద మొదట్లో నిధులు మంజూరయ్యాయని సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేపట్టి బిల్లు మంజూరు కాలేదన్న కారణంగా పనులు మధ్యలో వదిలి వేయడంతో అసంపూర్తిగా ఎక్కడికక్కడే రాళ్లు, దుమ్ము తేలి పెద్ద గోతులమయంగా రణస్థలం నుంచి వేణుగోపాలపురం, తాళ్లావలస, బొడ్డపాడు రోడ్డు, బేజిపురం తదితర గ్రామాల రోడ్డు అర్ధాంతరంగా పనులు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు బాటచారులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి నరక రహదారులకు మోక్షం కలిగించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

తెప్పలవలస నుంచి పాపారావుపేట వెళ్లే రహదారి

గురుగుబిల్లి నుంచి బట్టుపాళెం వెళ్లే రహదారి

# వెలవెలబోతున్న పారిశ్రామికవాడ

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

పట్టణ శివారులో ఉన్న పారిశ్రామిక వాడ గతంలో ఒక వెలుగు వెలిగి పలువురికి ఉపాధి కల్పించి ఎంతో ఘనంగా కళకళలాడుతూ ఉండేది. నేడు పరిశ్రమలు అనుకున్న స్థాయిలో లేక కార్మికులకు ఉపాధి లేక అధ్వానంగా తయారైంది. రాజకీయ నాయకులు ఊదరగొట్టే ఉపన్యాసాలు తప్ప పారిశ్రామికవాడను పట్టించుకున్న పాపాన పోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఎదురుగా పాలకొండ-శ్రీకాకుళం మెయిన్ రోడ్డు పక్కన 1972లో అప్పటి పార్లమెంట్ సభ్యులు బొడ్డేపల్లి రాజగోపాలరావు 19.52 ఎకరాల విస్తీర్ణంలో 36 ప్లాట్లతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మొట్టమొదటి పారిశ్రామిక వాడ ఇదే కావడం విశేషం. బొడ్డేపల్లి రాజగోపాలరావుకు బర్త్ డే గిఫ్ట్‌గా అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఇచ్చారని ఇప్పటికీ పలువురు గుర్తు చేసుకుంటారు. తొలినాళ్లలో పారిశ్రామిక వాడలో సినిమా కార్బన్స్, మేకులు, చింత పిక్కల పౌడర్, నవాటేపు, స్టెయిన్లెస్ స్టీల్, అల్యూమినియం ఫ్యాక్టరీ, గన్ని బ్యాగ్స్, బట్టల సబ్బులు తదితర పరిశ్రమలతో కలకలలాడుతూ కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఉండేది. తదనంతరం 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహం లేక కనుమరుగయ్యాయి. 2009లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హయాంలో అనుకున్న స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడంతో ఆర్థిక సంక్షోభంతో పరిశ్రమలు మూతపడ్డాయి. 2019లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అప్పటి శాసనసభ్యుడు కూన రవికుమార్ చొరవతో రూ.1.50 కోట్లు నిధులను మంజూరు చేయించి రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాలను కల్పించి పరిశ్రమల పురోభివృద్ధికి ఊతమిచ్చారు. గతంలో ఉన్న 36 ప్లాట్లను 48 ప్లాట్లుగా అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు. అలాగే రూ.2 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. అక్కడ నుంచి పరిశ్రమలు విద్యుత్ ఇబ్బందులకు గురికాకుండా ముందుకు వెళ్లసాగాయి. తొలినాళ్లలో ఎపిఐఐసితో ఒప్పందం చేసుకున్న వ్యక్తులు అప్పట్లో పరిశ్రమల స్థాపించి ఆ తర్వాత కాలంలో ఆర్థిక ఇబ్బందులకు గురై మూతపడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ పరిశ్రమలు నిర్వహిస్తున్న వ్యక్తులు రెండో పార్టీ వారు కావడం విశేషం. ప్రస్తుతం పారిశ్రామిక వాడలో వుడ్ వర్క్స్, వాటర్ ప్లాంట్లు, విత్తనాల తయారీ కేంద్రం, ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, అల్యూమినియం ఫ్యాక్టరీ తదితర పరిశ్రమలు కొనసాగు తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఎక్కువ మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు వచ్చేలా కృషి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పారిశ్రామికవాడలోని ప్లాస్టిక్ బాటిల్స్ ఫ్యాక్టరీ

ప్లాస్టిక్ రీసైక్లింగ్ ఫ్యాక్టరీ

మూతపడిన పరిశ్రమ

## ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

మౌలిక సదుపాయాలు ప్రభుత్వ ప్రోత్సాహం కరువై పరిశ్రమల పురోగతి కుంటుపడింది. ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించి పరిశ్రమలను ఆదుకొని ప్రోత్సహిస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు. అలాగే విద్యుత్, పన్నులు తదితర రాయితీలను కల్పించి పరిశ్రమల పురోగతికి ఊతమిచ్చినప్పుడే అభివృద్ధి పథంలో దూసుకెళ్తాంది.

**- తాళ్లూరి రాంబాబు, ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ మాజీ చైర్మన్**

శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం చేస్తున్న ప్రజాశక్తికి 45వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
జె. రమణమ్మ
పంచాయతీ సెక్రటరీ, గోరింట.
వి. జనార్ధనరావు
పంచాయతీ సెక్రటరీ, పెనుబర్తి.
ఎం. తులసీబాయ్ V.R.O
పి. గోవిందరావు Welfare& Education Asst
పి. వెంకటరమణ Agriculture Assistant
బి. మురళీరావు Village Surveyor
జి. రత్నకుమారి Digital Assistant
డి. సీతారత్నం Mahila Police
పి. డిల్లీశ్వరరావు Engineering Assistant
గోరింట సచివాలయం, పొందూరు మండలం

45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం ప్రజల పక్షం వహిస్తూ...
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజాశక్తికు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పి. జగదీశ్వరరావు
పంచాయతీ సెక్రటరీ, దల్లవలస.
కిల్లాన జ్యోతి
సర్పంచ్, దల్లవలస.
బమ్మిడి రాజేంద్రప్రసాద్ Digital Asst
గెడ్డివలస మీన WEA
చింతాడ నాగమణి Village Surveyor
పైడి అస్విని Mahila Police
కూన సుధీర్ Agricultur Asst
ఆర్. తులసి కుమారి ANM
లొట్టి అచ్చుతరావు JLM
దల్లవలస సచివాలయం పొందూరు మండలం

శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం చేస్తున్న ప్రజాశక్తికి 45వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జి. వెంకటరామరాజీవ్ Panchayat Secretary
జి. సూర్య ప్రకాస్ Welfare & Education Asst
మెట్ట మురళీధర్ Engineering Assistant
టి. సత్యరూప Digital Assistant
బగాది మోషిన్ Village Surveyor
కె. లావణ్య ANM
పైడి అజయ్ కుమార్ Vetranary Assistant
పిట్ట అసిరయ్య VRO
సనపల శ్యామలరావు JLM
జి. విద్యా సాగర్ VAA
కె. రజిని WPS
తాడివలస సచివాలయం, పొందూరు మండలం

# కాలం చెల్లిన కాలువలు.. తప్పని అవస్థలు

**గ్రామీణ ప్రాంతాలు సైతం సుందరంగా తీర్చిదిద్దుతామని చెబుతున్న ప్రభుత్వం, పాలకులు ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో గ్రామీణ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.**

**ప్రజాశక్తి- బూర్జ**

కాలం చెల్లిన కాలువలతో ఆ గ్రామస్తులు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని డొంకలపర్త గ్రామంలో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు కాలం చెల్లిన కాలువల్లో నీరు నిలబడి రోడ్లుపై మురుగు నీరు ప్రవహించడంతో ఆ గ్రామ ప్రజలు రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై యాడాదిన్నర అవుతున్నప్పటికీ గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పని చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. అలాగే అభివృద్ధి పనులు ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు గ్రామానికి ప్రజలు పాలకొండ - శ్రీకాకుళం సిఎస్‌పి రోడ్డు నుంచి విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయమని కోరగా మూడు నెలల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ కనీసం వాటి వైపు కన్నెత్తి కూడా చూడలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే గ్రామాల్లో తాగునీరు కొరత ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా మూడు నెలల్లో నాగావళి నది నుంచి నేరుగా ఈ గ్రామానికి నీరు అందజేస్తామని ఆయన చెప్పినప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో కాలం చెల్లిన కాలువలను మరమ్మతులు చేసి రోడ్లపై ఉన్న మురుగును తొలగించేందుకు కొత్త సిసి రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

PRAJASAKTI 45 ANNIVERSARY 1981-2025
ప్రజాశక్తి
ప్రజాశక్తికు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
'ప్రతి అక్షరం - ప్రజల పక్షం'
అనే నినాదంతో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజాశక్తి దినపత్రికు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
మీ శ్రేయోభిలాషి
శ్రీకాకుళం.

ప్రజాశక్తి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
PRAJASAKTI 45 ANNIVERSARY 1981-2025
అక్షర సత్యాలతో - అభ్యుదయ భావాలతో సామాజిక చైతన్యాన్ని రగిలిస్తూ.. ప్రతి అక్షరం - ప్రజల పక్షం నినాదంతో ముందుకు వెళ్తున్న ప్రజాశక్తి దినపత్రికకు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
డా॥ కె. మీనాకుమారి
మెడికల్ ఆఫీసర్, అక్కులపేట PHC,
ఆమదాలవలస మండలం.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
"ప్రతి అక్షరం - ప్రజల పక్షం" అంటూ ప్రజల సమస్యలను పత్రికా ముఖంగా తెలియజేస్తూ...
నేడు 45వవసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా ఇవే మా హార్దిక శుభాకాంక్షలు...
అక్రమ మద్యాన్ని అరికడదాం...! ప్రభుత్వానికి సహకరిద్దాం...!
నాటుసారా వద్దు.. ప్రభుత్వ మద్యం ముద్దు..
నాటుసారా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత
అధికారులు మరియు సిబ్బంది
ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ
శ్రీకాకుళం సిటీ

PRAJASAKTI 45 ANNIVERSARY 1981-2025
ప్రజాశక్తి
"ప్రతి అక్షరం - ప్రజల పక్షం"
అనే నినాదంతో ప్రజాశక్తి పాఠకుల మనస్సులో సుస్థిరస్థానం పొందుతూ 45వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ప్రజాశక్తి సిబ్బందికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు...
ఎస్. గణపతిరావు
తహశీల్దార్, శ్రీకాకుళం మండలం.
డిప్యూటీ తహశీలార్, ఆర్.ఐలు, వి.ఆర్.ఒ లు మరియు సిబ్బంది.
శ్రీకాకుళం మండలం.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
PRAJASAKTI 45 ANNIVERSARY 1981-2025
ప్రజాశక్తి దినపత్రిక
For Best Compliments
For ANDHRA ORGANICS LIMITED
PYDIBHIMAVARAM, SRIKAKULAM DIST.



## ఆన్‌లైన్ ఆటలతో జీవితాలు ఛిద్రం

ప్రజాశక్తి- బూర్జ

ఆన్‌లైన్ ఆటలతో జీవితాలు అంధకారమవుతున్నాయి. తొలుత సరదాగా మొదలైన ఆన్‌లైన్ ఆటలు చివరకు అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. అవసరాలకు అంతకుమించి సులభంగా డబ్బు సంపాదించాలన్న అత్యాశతో చాలా మంది ఆన్‌లైన్ ఆటలకు సిద్ధమవుతున్నారు. తొలుత కాలక్షేపం కోసం సరదాగా మొదలుపెట్టిన ఈ ఆటలు వారిని నిండా ముంచుతున్నాయి. ఇటీవల కాలంలో పట్టణాలు, నగరాలతో పాటు పల్లెలు అనే తేడా లేకుండా యువత, ఉద్యోగులతో పాటు విద్యార్థులు కూడా ఈ ఆటలవైపు ఆసక్తి చూపుతూ సర్వనాశనం అవుతున్నారు. వ్యక్తులు ఆన్‌లైన్ ఆటల్లో పూర్తిగా నష్టపోతున్నారు. మొదట్లో పదుల రూపాయలతో ప్రారంభమైన ఆట లక్షల్లోకి వెళ్ళిపోతూ నష్టపోతున్నారు. ఒకరికి ఒకరు సంబంధం లేకుండా ఆన్‌లైన్ ఆటలకు బానిసలు అవుతున్నారు. సరదాగా కాలక్షాపానికి 10తో మొదలు పెట్టి వేలల్లోకి ఆ తర్వాత వేళల్లో నష్టపోతున్నారు. మరి కొంతమంది ఆన్‌లైన్ ఆటల కోసం ఆస్తులను, దొరికిన చోట అప్పులు చేస్తూ నిండా మునుగుతున్నారు. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ ఆటలకు బానిసలై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. యువత, విద్యార్థులతో పాటు ఉన్నత స్థాయిలో ఉన్న ఉద్యోగస్తులు కూడా ఆసక్తి చూపడం విశేషం. ఆన్‌లైన్ ఆటలను ప్రభుత్వం కొన్నింటిని నిషేధించింది. అయినప్పటికీ పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న యాప్‌లను అరికట్టడంలో విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్ ఆటలతో భవిష్యత్ అంధకారం అవుతుంటే మరోవైపు ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్ ఆటలతో డబ్బు సంపాదించాలనే ఆలోచన విడనాడి జీవితాలను పలువురు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికైనా ఆన్‌లైన్ ఆటలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# నిర్లక్ష్యపు నీడలో...!

**రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యాలయం (ట్రిపుల్ ఐటి) శ్రీకాకుళం క్యాంపస్ సమస్యలతో సహవాసం చేస్తోంది. ట్రిపుల్ ఐటి ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. నేటికీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ఊసే లేదు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికనే నియామకాలు సాగుతున్నాయి. ఇక మౌలిక వసతుల గురించి ఎంత తక్కువ చెప్పకుంటే అంత మంచిది. అసంపూర్తి భవన నిర్మాణాలు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా దర్శనమిస్తున్నాయి.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

- **శ్రీకాకుళం ఆర్‌జియుకెటి క్యాంపస్‌ని వేధిస్తున్న వసతి కొరత**
- **తొమ్మిదేళ్లు పూర్తయినా వెంటాడుతున్న సమస్యలు**
- **ప్రభుత్వాలు మారినా మౌలిక వసతులు మృగ్యం**
- **పూర్తిస్థాయి క్యాంపస్ నిర్వహణ ఎప్పటికి సాధ్యమయ్యేనో?**

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యాలయం (ట్రిపుల్ ఐటి) ప్రతిష్టాత్మక విద్యాసంస్థ. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో విద్యనందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైంది. శ్రీకాకుళం జిల్లాలో ఎచ్చెర్ల మండలం షేర్‌మహమ్మద్ పురం (ఎస్‌ఎం పురం) గ్రామ పరిధిలో 2016 అక్టోబర్ 9న అప్పటి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అప్పటికే నిర్మించిన 21వ శతాబ్ది గురుకుల భవనాల్లో ప్రారంభించారు. ఏడాదికి 1100 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. కనీస మౌలిక వసతులు ఇప్పటికీ సాధ్యం కాలేదు. రెగ్యులర్ టీచింగ్, నాన్ టీచింగ్ రిక్రూట్‌మెంట్ లేదు. స్థానికంగా అద్దె క్యాంపస్, నూజివీడు క్యాంపస్‌లో క్లాసులు విభజించి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా పరిస్థితుల్లో మార్పు లేదు.

నిలిచిన భవన నిర్మాణ పనులు

ఆర్‌జియుకెటిలో సమీకృత ఇంజినీరింగ్ ఆరేళ్ల కోర్సు నిర్వహిస్తున్నారు. రెండేళ్లు పియుసి (ప్రీ యూనివర్సిటీ కోర్స్), నాలుగేళ్ల ఇంజినీరింగ్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజ్ ఇవ్వడం వల్ల, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల మెరిట్ విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు.

**మౌలిక వసతులు మృగ్యం**

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో మౌలిక వసతుల కోసం 200 ఎకరాలు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం నిధుల కొరత లేకుండా క్యాంపస్‌ను గ్రీన్ ఛానల్‌లోకి తీసుకొచ్చింది. రూ.157 కోట్లు కేటాయింపులు చేసినా, ఆ నిధులు మాత్రం మంజూరు కాలేదు. భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైంది. ఈ కాలంలో కనీస నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. అసంపూర్తి భవనాలపై దృష్టి పెట్టలేదు. దీంతో వసతి ప్రధాన సమస్యగా మారింది. ప్రధానంగా వసతి గృహాల సముదాయం కొరత, రన్నింగ్ నీటి సౌకర్యం వేధిస్తోంది. కొండ కావడం వల్ల బోర్లు నుంచి అవసరానికి సరిపడా నీరు లభ్యం కావడం లేదు. మరోవైపు ముగ్గురు ఉండాల్సిన గదుల్లో ఆరుగురు నుంచి ఎనిమిది మంది వరకు ఇరికిస్తున్నారు. పూర్తిస్థాయి వసతి కల్పనకు రూ.200 కోట్ల వరకు అవసరం. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తేనే ఇది సాధ్యం. పూర్తిస్థాయి సామర్థ్యం గల క్యాంపస్ ఎప్పటికి సాధ్యమవుతుందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. మౌలిక వసతుల కొరత, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రిక్రూట్‌మెంట్ వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే తాత్కాలిక వసతి ఏర్పాటు చేస్తాం.

**- అమరేంద్ర కుమార్, రిజిస్ట్రార్, ఆర్‌జియుకెటి**

**ప్రభుత్వాల నిర్లక్ష్యం**

ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో కొన్నేళ్లుగా పియుసి రెండేళ్లు, ఇంజినీరింగ్ మొదటి రెండేళ్లు క్లాస్ వర్క్ నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ మూడు, నాలుగేళ్ల క్లాస్ వర్క్ నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో నిర్వహిస్తున్నారు. పియుసి మొదటి రెండేళ్లు పురుష లకు చిలకపాలెంలో అద్దెకి తీసుకున్న శివానీ క్యాంపస్‌లో క్లాస్ వర్క్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నుంచి పియుసి మొదటి ఏడాది నూజివీడులో క్లాస్ వర్క్ నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్లాస్ వర్క్ జూలైలో ప్రారంభం కానుంది. శివానీ క్యాంపస్‌లో పియుసి రెండో ఏడాది క్లాస్ వర్క్ నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

ఎస్‌ఎం పురం ప్రభుత్వ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ మొదటి, రెండు, మూడు, నాలుగేళ్లు నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. వసతి కొరత వెంటాడుతున్నా అధికారులు ఈ మేరకు తరగతుల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. మరోవైపు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికనే నియమిస్తున్నారు. క్యాంపస్ ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదంటే ప్రభుత్వాల నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతోంది. ఇప్పటికైనా వసతులు సమకూర్చి, విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

---

# పరిశ్రమల్లో భద్రత కరువు

ప్రజాశక్తి - రణస్థలం

జిల్లాలో కార్మికులకు భద్రత కరువైంది. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి ప్రభుత్వ కాలంలో పూర్తిగా నిర్లక్ష్యం రాజ్యమేలుతుంది. పరిశ్రమల్లో, క్వారీల్లో, చివరకు భవన నిర్మాణ కార్మికులకు సైతం భద్రత కరువై.. ప్రాణాలు పోగొట్టుకున్నారు. కనీస వేతనాలు, సౌకర్యాలకు నోచుకోకపోగా.. మండుతున్న యంత్రాల మధ్య పనిచేస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. జిల్లాలో పైడిభీమవరం పారిశ్రామికవాడతో పాటు పలాస ప్రాంతంలో జీడి పరిశ్రమలు ఉన్నాయి. టెక్కలి, పొందూరు వంటి ప్రాంతాల్లో క్వారీలు నడుస్తున్నాయి. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత లేదు. కార్మిక చట్టాలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. యంత్రాల మధ్య పనిచేసే కార్మికులకు హీట్ రెసిస్టెంట్ ఆప్రాన్లు, గమ్‌బూట్లు, హెల్మెట్లు గ్లౌజులు విధిగా అందించాలి. వీటిని అందించడంలో పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు మృత్యువాత పడుతున్నారు. క్షతగాత్రులుగా మారుతున్నారు. బాధితులకు నామమాత్రంగా పరిహారం అందించి యాజమాన్యాలు చేతులు దులుపుకొంటున్నట్టు ఆరోపణలున్నాయి.

**పారిశ్రామిక వాడలో తరచూ ప్రమాదాలు**

పైడిభీమవరం పారిశ్రామిక వాడలో సుమారు 30 వరకూ పరిశ్రమలున్నాయి. వీటిలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పరిశ్రమల్లో భద్రత లేకపోవడం అనేది ఒక సంక్లిష్టమైన సమస్య. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. భారతదేశంలో పారిశ్రామిక భద్రతా లోపాలు తరచుగా ప్రమాదాలకు దారితీస్తాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది.

**పరిశ్రమల్లో భద్రత కరువుకు ప్రధాన కారణాలు**

నిర్లక్ష్యం చాలా పరిశ్రమల యజమానులు భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తారు. తక్కువ ఖర్చుతో పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో, నాసిరకం పరికరాలు ఉపయోగించడం, భద్రతా నిబంధనలను పట్టించుకోకపోవడం జరుగుతుంది.

**పర్యవేక్షణ లోపం**

ప్రభుత్వ అధికారులు, కార్మిక శాఖ తగినంతగా తనిఖీలు నిర్వహించకపోవడం వల్ల భద్రతా లోపాలను గుర్తించడం కష్టం అవుతుంది. ప్రమాదాలు జరిగిన తర్వాత మాత్రమే అధికారులు స్పందిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**పాత పరికరాలు**

కొన్ని పరిశ్రమల్లో పాత, కాలం చెల్లిన యంత్రాలు, రియాక్టర్లు వాడటం వల్ల అవి అధిక పీడనం లేదా ఉష్ణోగ్రతల వద్ద పేలిపోయే ప్రమాదం ఉంది. సరైన నిర్వహణ లేకపోవడం కూడా ఒక కారణం.

**శిక్షణ కరువు**

కార్మికులకు సరైన శిక్షణ ఇవ్వకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయి. ముఖ్యంగా కొత్తగా చేరిన కార్మికులకు, ప్రమాదకర రసాయనాలను ఎలా నిర్వహించాలో అవగాహన ఉండకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తాయి.

**నిధుల కొరత**

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు భద్రతా ఏర్పాట్లకు అవసరమైన నిధులు కేటాయించ లేకపోవడం ఒక సమస్య. అధునాతన భద్రతా పరికరాలు ఏర్పాటు చేయలేక పోతున్నారు.

**భద్రతా నిబంధనలు, వాటి అమలు**

భారతదేశంలో పారిశ్రామిక భద్రత కోసం ఫ్యాక్టరీల చట్టం, 1948 వంటి కొన్ని చట్టాలు ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారం, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు కల్పించడం యజమాని బాధ్యత. అయితే, ఈ చట్టాల అమలులో లోపాలు ఉండటం వల్ల, ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రభుత్వాలు భద్రతను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నాయి. ఉదాహరణకు, కొన్ని రాష్ట్రాల్లో థర్డ్ పార్టీ ఆడిట్ పథకాలను ప్రవేశపెట్టి, పారదర్శకతను పెంచడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి, ప్రభుత్వాలు, పరిశ్రమల యజమానులు కలిసి పనిచేయాలి. భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయడం, కార్మికులకు సరైన శిక్షణ ఇవ్వడం, నిరంతర పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవడం చాలా అవసరం. అయితే పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఉన్న పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు సరైన వైద్య సదుపాయాలు కూడా లేవు. పైడిభీమవరంలో 2010లో కార్మికుల సౌకర్యార్థం ఇఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. కానీ వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించక పోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. పరిశ్రమల్లో ఏ ప్రమాదం జరిగినా మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను విజయనగరం తరలిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 30 వేల మంది వరకు కార్మికులు గుర్తింపు పొందారు. వారి మూలవేతనం నుంచి 1.75 శాతం ఇఎస్‌ఐకి వెళ్తుంది. యాజమాన్యాలు సైతం కొంత మొత్తాన్ని భరిస్తున్నాయి. కానీ ఇఎస్‌ఐ సేవలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. సకాలంలో అత్యవసర వైద్యం అందక చాలామంది మృత్యువాత పడుతున్నారు. అందుకే తక్షణం 100 పడకల ఇఎస్‌ఐ ఆస్పత్రితో పాటు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తేవాలని కార్మికులు కోరుతున్నారు. చట్టాలను పటిష్ఠంగా అమలుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సరాకా పరిశ్రమలో రియాక్టర్ వద్ద మంటలు అదుపు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

**అమ్మో క్వారీలు**

జిల్లాలో వంద వరకూ క్వారీలు నడుస్తున్నాయి. అందులో అనుమతి ఉన్నవి కొన్నే. ప్రధాన రాజకీయ కుటుంబాలకు చెందిన వారి చేతిలో క్వారీలు ఉన్నాయి. అక్కడ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నా బయటకు రాకుండా మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. టెక్కలి, నందిగాం, పొందూరు, కంచిలి, పలాస మండలాల్లో క్వారీల నిర్వహణ అధికం. ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కానీ వెలుగుచూసిన ఘటనలు కొన్నే. రాజకీయ జోక్యంతో అధికారులు అటువైపుగా చూడడం లేదన్న విమర్శలున్నాయి. అనుమతి లేకుండా క్వారీలు నిర్వహిస్తున్నా.. కార్మికులకు భద్రత లేకపోయినా కనీస చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

# ప్రాజెక్టుల్లో కానరాని ప్రగతి

- అసంపూర్తిగా వంశధార పనులు
- మందకొడిగా సాగుతున్న ఆఫ్‌షోర్
- నదుల అనుసంధాన పనులదీ అదే పరిస్థితి
- కదలిక లేని కరకట్టల పనులు

**టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సాగునీటి ప్రాజెక్టుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వంశధార, ఆఫ్‌షోర్‌లకు బడ్జెట్‌లో కాస్తాకూస్తో నిధులు కేటాయించినా, పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. మిగిలిన ప్రాజెక్టులకు సంబంధించి వంశధార, నాగావళి నదుల అనుసంధానం, వంశధార, నాగావళి కరకట్టల పనుల ఊసే కనిపించడం లేదు. హిరమండలం రిజర్వాయర్ ఎత్తిపోతల పథకం పనుల్లోనూ పెద్దగా పురోగతి కనిపించడం లేదు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మినహా మిగిలిన ప్రాజెక్టులన్నీ 2014-19 కాలంలో టిడిపి హయాంలో ప్రారంభించినవే. ఇందులో వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2 పనులు టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి 93 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం దృష్టిసారిస్తే ఏడాదిలోనే పనులు పూర్తయ్యే పరిస్థితి ఉన్నా, వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించడం గమనార్హం.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టు పనులను రూ.933.90 కోట్లతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. 2008 జులై నాటికి 87 ప్యాకేజీ పనులు 31 శాతం, 88 ప్యాకేజీ పనులు 36 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1616.23 పెంచింది. 2019 వరకు 87 ప్యాకేజీ పనులు 64 శాతం, 88 ప్యాకేజీ పనులు 81 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 87 శాతం పూర్తయ్యాయి. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అంచనా వ్యయాన్ని రూ.2,407.79 కోట్లకు పెంచింది. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 94.50 శాతం పనులు జరిగాయి. ఇప్పటివరకు రూ.2062.79 కోట్లను ఖర్చు చేశారు.

### అనుసంధానం పనులపై ఆశలు

వంశధార, నాగావళి నదుల అనుసంధార పనులకు రూ.78.96 కోట్లు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది.

పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం ఈ గతేడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా పొడిగించింది. ఇప్పటివరకు 73 శాతం పనులే జరిగాయి. ఈ పనులూ ఏడాదిలోనే పూర్తయ్యే అవకాశమున్నా, ఇప్పటికీ అదే స్థితిలో ఉన్నాయి. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం డబ్బులు, కాంట్రాక్టర్‌కు బిల్లుల బకాయిలు తేలిస్తే పనులు ముందుకు సాగే అవకాశం ఉన్నా ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించలేదు.

### మందకొడిగా ఆఫ్‌షోర్ పనులు

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి, మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్.వి.ఇ.సి- ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం రిజర్వాయర్ పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జూలై 7, 2019 వరకు గడువు ఇచ్చింది.

టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.852.45 కోట్లకు ఆమోదం తెలిపింది. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి 38 శాతం మాత్రమే పనులు పూర్తి కాగా, ఏడాది కాలంలో అదనంగా కేవలం ఏడు శాతం పనులు మాత్రమే జరిగాయి.

### కరకట్టల పనులు ప్రారంభమయ్యేనా?

వంశధార, నాగావళి కరకట్టల పనులు 2007-08లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయి. వంశధార కరకట్టలకు సంబంధించి నాలుగు ప్యాకేజీల పనులు 5.66 శాతం నుంచి 21.34 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నాగావళి కరకట్టల పనులు 33.32 శాతం పూర్తయ్యాయి. నిర్మాణ సంస్థలు 2010 నుంచి పనులను ఆపేసాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం కొత్తగా టెండర్లను పిలిచి కొత్త నిర్మాణ సంస్థలకు పనులను అప్పగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉన్నపళంగా పనులను నిలిపేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. వాటిలో కరకట్టల నిర్మాణానికి రూ.13.5 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు. వంశధారపై 23 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.130 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం కనీసం వాటి జోలికి కూడా వెళ్లడం లేదు.

# పేద బాలికలకు వరం కెజిబివి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

చాలామంది అనాధలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు విద్యకు దూరం అవుతున్నారు. ఇటువంటి బాలికలకు విద్యను అందించటం కోసం కేంద్ర ప్రభుత్వం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలను ప్రారంభించింది. ప్రాథమికోన్నత స్థాయిలో రెసిడెన్షియల్ విద్యా విధానం ఈ పాఠశాలల్లో కొనసాగుతుంది. జిల్లాలో కెజిబివిల సీట్లకు ఎంతో డిమాండ్ ఉంది. సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ నిర్వహిస్తుంది.

జిల్లాలో 30 మండలాలు ఉండగా 25 కెజిబివిలు ఉన్నాయి. పాఠశాలకు 280 సీట్లు ఉంటాయి. డిమాండ్ మేరకు 10 శాతం సీట్లు

సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కార్యాలయం

### జిల్లాలో 25 విద్యాలయాలు

పెంచి కేటాయిస్తున్నారు. ప్రభుత్వం 280 మంది విద్యార్థులకు సరిపడే రేషన్ మాత్రమే సరఫరా చేస్తుంది. దీంతో సీట్లు కోసం తీవ్ర పోటీ ఉన్నా, ప్రజా ప్రతినిధుల నుంచి సిపార్సులు వస్తున్నా సీట్లు ఇచ్చే పరిస్థితి కష్టంగా మారుతుంది. అంత డిమాండ్ కెజిబివిలకు ఉంది.

జిల్లాలో నరసన్నపేట, టెక్కలి, పలాస, వజ్రపుకొత్తూరు, సరుబుజ్జిలి మండలాల్లో కెజిబివిలు లేవు. ఈ మండలాల్లో సంస్థలు అవసరం ఉన్నా ఏర్పాటు చేయలేదు. అనేకసార్లు ప్రజలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. ఆరు పాఠశాలల్లో మాత్రమే ఇంటర్మీడియట్ నిర్వహిస్తున్నారు. మొత్తం అన్ని పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహించాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండటం, అర్హులైన ఉపాధ్యాయుల నియామకం, కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు, మహిళల కోసం ప్రత్యేకంగా విద్యాలయాల నిర్వహణ వంటి వాటి వల్ల

పొన్నాడ కెజిబివి పాఠశాల

మంచి ఫలితాలు సాధ్యమవుతున్నాయి. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో బాలికలు సత్తా చాటుతున్నారు. డ్రాపవుట్లుగా మిగిలి పోవాల్సిన విద్యార్థినులు, ఉన్నత విద్య వరకు ముందుకు సాగుతున్నారంటే అందుకు కారణం కెజిబివిలే.

సీట్లు పెంపు, అన్ని మండలాల్లో విద్యాసంస్థలు ఏర్పాటు, అన్ని విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహణ వల్ల ప్రయోజనం ఉంటుంది.

### ప్రమాణాలతో కూడిన విద్య

కెజిబివిల సమస్యలు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. ఐదు మండలాల్లో విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరాం. అన్ని పాఠశాలల్లో ఇంటర్మీ డియట్ కోర్సులు ప్రారంభించాలని తెలియ జేశాం. సీట్లు పెంపుకు అనుమతి ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్య సీలింగ్‌తో సంబంధం లేకుండా నిధులు మంజూరు చేయాలని కోరాం. మెరుగైన విద్యా ప్రమాణాలతో విద్య అందిస్తున్నాం. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం.

- సంపత్‌రావు శశిభూషణ్, ఎపిసి సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు

శిథిలావస్థకు చేరిన వంతెన

# పొంచి ఉన్న ప్రమాదం

## శిథిలావస్థకు చేరుకున్న వంతెన

ప్రజాశక్తి- బూర్జ

ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని నారాయణపురం ఎడమ కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన పైనుంచి 30 గ్రామాల ప్రజలు, వాహనాలు అనునిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా నారాయణపురం ఆనకట్ట వద్ద ఇసుక ర్యాంపు ఉండడంతో భారీ ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి, పగలు ఇసుక లోడ్లతో వాహనాలు వెళ్తు ండడంతో ఏ సమయంలో వంతెన కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. మండలంలోని లాభం, గుత్తావల్లి, సంతకవిటి మండలాల నుంచి సుమారు 30 గ్రామాల ప్రజలకు ఈ వంతెన ప్రధాన ఆధారం. ఈ వంతెనపై నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు శ్రీకాకుళం, ఇటు కొల్లివలస వెళ్లి వస్తూ ఉంటారు. ఇటీవల వంతెన సైడ్ వాల్ కూలిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని వాపోతున్నారు.

# వెదురు చెట్లతో జరభద్రం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని మదనాపురం నుంచి సరుబుజ్జిలి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వెదురు చెట్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకి ఇరువైపులా ఉన్న వెదురు చెట్లు గాలివీచే సమయంలో పూర్తిగా రహదారికి వంగుతుండంతో వాహనదారులకు తగలడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల మదనాపురం నుంచి సరూబుజ్జిలి వాహనంపై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా వెదురు కర్ర తగలడంతో ప్రమాదం సంభవించి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మదనాపురం నుంచి సరుబుజ్జిలి రహదారికి ఇరువైపులో ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నా... అవి పెనుగాలులకు వంగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనాలు దారులతో పాటు గ్రామస్తులు తెలిపారు. ఈ రహదారిపై వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారని, ముఖ్యంగా ట్రాక్టర్లు, వ్యాన్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను ప్రమాదాల నివారణకు వెదురు చెట్లను తొలగించాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.